


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 83 | మంగళవారం 24 - 03 -2026 | పేజీలు : 12 | వెల-3


## అధికార పీఠంపై 25 ఏళ్లు...



## ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు..

# స్టీల్ సిటీకి ఫౌండేషన్.



**ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు..స్పీడ్ ఆఫ్ డూయింగ్**

**ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు**

**ఉత్తరాంధ్ర సరికొత్త చరిత్రరాయబోతోంది**

**స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు**




ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్.




# ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంపై దృష్టి సారించడమే సరైన మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలుచుకోవాలని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వంటి వాటి

# ఐకానిక్ టవర్‌గా అసెంబ్లీ నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక అప్‌డేట్స్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని



# ఇరాన్‌తో యుద్ధంపై ట్రంప్ నిర్ణయం.

ఇరాన్‌తో యుద్ధాన్ని ఐదు రోజుల పాటు విరమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై ఇజ్రాయెల్ స్పందించింది. యుద్ధ విరమణ అమెరికాకే పరిమితమని స్పష్టం చేసింది. తాము యుద్ధాన్ని విరమించలేదని పేర్కొంది. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రారంభమైంది.



## ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు..



### ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో పవన్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన జరిగింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి,

## పోలీసుల తీరుపై అంబటి ధ్వజం..



తన నివాసం, కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జనవరి 31న సుమారు 7 గంటల పాటు తన ఆస్తులపై విధ్వంసం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## విజయమ్మ లేఖ నిజం..

## దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి




తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు.

## సౌదీలోని అమెరికా స్థావరాలపై

# ఇరాన్ దాడులు



సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) సోమవారం ఉదయం ప్రకటించింది. ఈ పరిణామంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా ఈ దాడులు జరిపినట్లు ఐఆర్ జీసీ ప్రతినిధి తెలిపారు.

**40వ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని మోదీని కలిసిన కంగనా రనౌత్**



# ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

**యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు**

**లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి**



పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు.

## ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు..

పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో, లక్ష మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దీని ద్వారా ఏటా 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించడం అనేది ఈ ప్రాంత యువతకు గొప్ప వరం. ఆంధ్రప్రదేశ్‌పై, మా ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఇంత భారీ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినందుకు ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, సీఈఓ దిలీప్ ఉమెన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. పర్యావరణ శాఖ మంత్రి హోదాలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. "ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కర్బన ఉద్గారాలను (కార్బన్ ఫుట్‌ప్రింట్) పరిమితం చేసేలా ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని తెలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్న సంస్థలను మేం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం" అని వివరించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన అన్ని సహకారాలు అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, హోం మంత్రి అనిత, ఇతర మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్‌తో యుద్ధంపై ట్రంప్ నిర్ణయం..

అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల కారణంగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసింది. దీంతో దాదాపు అన్ని దేశాల్లో ఇంధన సంక్షోభం తలెత్తింది. ట్రంప్ యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించినట్లు ప్రకటిస్తే, ఇజ్రాయెల్ మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించడం గమనార్హం. ఇరాన్‌తో రెండురోజుల పాటు చర్చలు జరిగాయని, ఈ చర్చలు సానుకూలంగా సాగాయని, ఈ నేపథ్యంలో యుద్ధానికి ఐదు రోజుల పాటు విరామం ఇస్తున్నానని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో తదుపరి చర్చల ఫలితాల ఆధారంగా నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## పోలీసుల తీరుపై అంబటి ధ్వజం..

తన ఇంటిపై దాడి చేసిన వారికి కేవలం ఏడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని, కానీ అదే సెక్షన్లతో తనను మాత్రం 18 రోజుల పాటు జైలుకు పంపడం అన్యాయమని అంబటి మండిపడ్డారు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ స్టేషన్ లోని సీసీటీవీ ఫుటేజీని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. టీడీపీ నేతలు దాడి చేస్తున్నప్పుడు పోలీసులు వారికి పూర్తిగా సహకరించారని, తాను ఫిర్యాదు చేసే వరకు కనీసం సుమోటోగా కూడా కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో దారుణంగా వ్యవహరించారని అన్నారు. ఈ దాడుల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ హస్తం ఉందని నేరుగా ఆరోపించారు. ఈ కేసులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంబటి స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని, అక్కడ న్యాయం జరగకపోతే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మెట్లు ఎక్కేందుకైనా సిద్ధమని హెచ్చరించారు.

## సుదీర్ఘ కాలంగా ప్రజాసేవలో మోదీ

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రధాని నరేంద్ర మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ అధిపతిగా నిరవధికంగా 8,931 రోజుల సేవ పూర్తి చేసిన సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోదీ రాజకీయ ప్రయాణం, భారత ప్రధానిగా కొనసాగుతూ దేశానికి విశేష సేవలు అందించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పదవిలో గడిపిన కాలం మాత్రమే కాకుండా, అచంచల సంకల్పం, అలసటలేని కృషి, దేశ సేవకు అంకితమైన జీవితం ప్రధాని మోదీని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని ఆయన అభిప్రాయపడ్డారు పవన్ కల్యాణ్.. 'గ్రాస్ రూట్ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి దేశాన్ని నడిపిస్తూ 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చారు' అని పవన్ కల్యాణ్ అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ, త్యాగం, అపార కృషితో కొనసాగుతున్న నాయకత్వం దేశ అభివృద్ధికి దోహదపడిందని తెలిపారు. మౌలిక వసతులు, పేదల సాధికారత, డిజిటల్ మార్పులు వంటి రంగాల్లో ప్రధాని మోదీ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్టను పెంచడంలో కూడా ప్రధాని నరేంద్ర మోదీ పాత్ర కీలకమని పేర్కొన్నారు పవన్ కల్యాణ్?

## విజయమ్మ లేఖ నిజం..
## దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి:

సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**ఆస్తుల కోసం కాదు.. న్యాయం కోసమే పోరాటం** వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. "నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకుపడుతున్నారు. వివేకా హత్య కేసులో సాక్షి మీడియా ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదు. దానికి సమాధానం చెప్పాల్సింది అవినాష్ రెడ్డి, సాక్షిని నడుపుతున్న భారతీ రెడ్డి. ఆ విషయంపై మాట్లాడలేక, ఆస్తులంటూ కొత్త వివాదాన్ని సృష్టిస్తున్నారు," అని షర్మిల విమర్శించారు. తాను ఆస్తుల కోసం పాకులాడుతున్నట్టు, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. తన పోరాటం ఆస్తుల కోసం కాదని, ఒకవేళ అదే తన అజెండా అయితే తెలంగాణలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ పెట్టేదాన్నని స్పష్టం చేశారు. జగన్‌తో తాను సంతకం చేసిన ఎంఓయూ పత్రాలను ఇన్నాళ్లూ కోర్టుకు సమర్పించలేదని, కేవలం జగన్ తన తల్లిపై కేసు వేయడం వల్లే ఆ పత్రాలు బయటకు వచ్చాయని వివరించారు.

**విజయమ్మ లేఖ వాస్తవం.. దమ్ముంటే కాదనమనండి** తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వైసీపీ సైతాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. "విజయమ్మ అంటే రాజశేఖర్ రెడ్డి గారిలో సగం. ఆయన ఆశయాలకు సజీవ రూపం. అలాంటి వ్యక్తి, నలుగురు బిడ్డలకు ఆస్తి సమానంగా పంచాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశమని, జగన్ అన్యాయం చేస్తున్నాడని లేఖలో స్పష్టంగా రాశారు. ఈ గోబెల్స్ ప్రచారం ఆపాలని కూడా చెప్పారు. ఇకనైనా డీసెన్సీ ఉన్నవాళ్లు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. ఇంకా మాట్లాడుతున్నారంటే, మొరగడం కుక్కల నైజం అనుకోవాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖలోని సంతకం తన తల్లిది కాదని, ఒత్తిడితో పెట్టించానని వైసీపీ ప్రచారం చేస్తోందని, నిజంగానే ఆ సంతకం ఆమెది కాకపోతే విజయమ్మే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. జగన్ అయినా తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు చెప్పించొచ్చు కదా అని నిలదీశారు.

**దమ్ముంటే జగనే మాట్లాడాలి** ఈ ఆస్తుల వివాదం పూర్తిగా వ్యక్తిగతమైనదని, దీనిపై మాట్లాడాల్సింది జగన్మోహన్ రెడ్డి అని షర్మిల అన్నారు. "ఇది జగన్ వ్యక్తిగత, ఆస్తులకు సంబంధించిన విషయం. దీనిపై ఆయన పార్టీ నేతల చేత, సోషల్ మీడియా సైన్యం చేత ఎందుకు మాట్లాడిస్తున్నారు? రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశం, ఇద్దరం కలిసి సంతకాలు చేసిన ఎంఓయూ గురించి తెలిసిన జగన్ మాట్లాడాలి కదా? అంటే, ఆయనకు మాట్లాడే దమ్ము లేక ఇతరుల వెనుక దాక్కుంటున్నారని అనుకోవాలా?" అని షర్మిల ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రత్యేక హోదాను, పోలవరాన్ని తాకట్టు పెట్టి మోదీకి దత్తపుత్రుడిగా మారింది జగనేనని, తాను కాదని ఆమె ఆరోపించారు.

**వైసీపీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు** రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసమే తాను, తన తల్లి రాజకీయాల్లో ఉన్నామని, జగన్‌లా స్వార్థ రాజకీయాలు చేయడం లేదని షర్మిల అన్నారు. ఫ్రంట్ పేజీలో రాజశేఖర్ రెడ్డి గారి ఫోటో వేసుకుని సత్యమేవ జయతే అని చెప్పుకునే సాక్షి పత్రికకు నిజం పట్ల గౌరవం లేదని విమర్శించారు. జగన్‌కు నిజం వైపు నిలబడే ధైర్యం లేకపోవడం వల్లే తన పార్టీలోని నాయకులతో తనపై విమర్శలు చేయిస్తున్నారని షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాళ్లను నాయకులు అనాలో, కుక్కలు అనాలో మీరే అనుకోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్నది జగనే అని, ఆయన దర్శకత్వంలోనే ఈ నాటకం నడుస్తోందని ఆమె ఆరోపించారు.

## సౌదీలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

అమెరికా నిఘా విమానాలు ఈ స్థావరాల నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నందున వాటిని లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన ఐదు కేసీ-135 స్ట్రాటోట్యాంకర్ విమానాలు దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.మరోవైపు, సౌదీ అరేబియా తమ దేశంపైకి వస్తున్న ఇరాన్ ఆయుధాలను అడ్డుకుంది. రియాద్, తూర్పు ప్రాంతం లక్ష్యంగా వచ్చిన రెండు డ్రోన్లు, ఒక బాలిస్టిక్ క్షిపణిని తమ వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు సౌదీ రక్షణ శాఖ ప్రకటించింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మౌలిక సదుపాయాలపై కొత్తగా బాంబు దాడులు మొదలుపెట్టింది. తమ లక్ష్యాలను సాధించే దిశగా యుద్ధం సరైన మార్గంలోనే సాగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. మరోపక్క, ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత సంక్షోభం 1970ల నాటి చమురు సంక్షోభం కంటే భయంకరంగా మారవచ్చని అంతర్జాతీయ ఇంధన సంస్థ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ ప్రభావం భారత్‌పైనా స్పష్టంగా కనిపిస్తోంది. చమురు, ఎల్‌పీజీ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంపై భారత పార్లమెంటులో ఆందోళన వ్యక్తమైంది.

## 40వ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని మోదీని కలిసిన కంగనా రనౌత్

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఈరోజు తన 40వ పుట్టినరోజును అత్యంత ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. కంగనా కుటుంబంతో ప్రధాని సరదాగా గడిపిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తన పుట్టినరోజు సందర్భంగా ప్రధానిని కలిసిన కంగనా, ఆయనకు హిమాచల్ సంస్కృతిని ప్రతిబింబించేలా ఒక అందమైన శాలువాను కప్పారు. ఆమె సోదరుడు అక్షత్ రనౌత్ 'దశావతారాన్ని' అద్భుతంగా చిత్రీకరించిన ఇత్తడి వాల్ ఫ్రేమ్‌ను ప్రధానికి బహుమతిగా అందజేశారు. ముఖ్యంగా కంగనా మేనల్లుడితో ప్రధాని ఆడుకుంటున్న దృశ్యాలు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. "గౌరవనీయ ప్రధానమంత్రి గారి అపాయింట్ మెంట్ దొరకడం, ఆయన మార్గదర్శకత్వం లభించడం నా అదృష్టం. ఇది నా జీవితంలో మర్చిపోలేని పుట్టినరోజు" అంటూ కంగనా తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ కంగన మళ్లీ వెండితెరపై తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. మనోజ్ తాపారియా దర్శకత్వంలో రాబోతున్న ఓ క్రేజీ ప్రాజెక్టులో కంగనా ఒక పవర్‌ఫుల్ 'నర్సు' పాత్రలో కనిపించబోతున్నారు. 2008 ముంబై ఉగ్రదాడుల సమయంలో ప్రాణాలకు తెగించి పోరాడిన మెడికల్ స్టాఫ్ కథాంశంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇప్పటికే దీని షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో ఆర్.మాధవన్‌తో కలిసి నటించబోయే 'తను వెడ్స్ మను 3' ఫ్రాంచైజీపై భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## ఇంటిపై దాడి,ధ్వంపై అంబటి ఫిర్యాదు

తన ఇల్లు, ఆఫీసుపై జరిగిన దాడిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి కేసులో విచారణ అధికారిని మార్చాలని, నల్లపాడు పోలీస్ స్టేషన్ లో కస్టోడియల్ టార్చర్ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని రెండు ఫిర్యాదులు చేశారు. టీడీపీ నాయకుల దాడికి పోలీసులు పూర్తిగా సహకరించారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని తాను ఫిర్యాదు చేసే వరకూ కేసు నమోదు చెయ్యలేదన్నారు. ఏడేళ్ల లోపు శిక్షపడే సెక్షన్లతో కేసు నమోదు చేసినా జైలులు పంపి తన ఇంటిపై దాడి చేసినవారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారన్నారు. పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు నా కేసు వ్యవహారంలో దారుణంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇక్కడ న్యాయం జరగకపోతే హైకోర్టు, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని తేల్చిచెప్పారు. జనవరి 31న తన ఇల్లు, కార్యాలయంపై సుమారు 7 గంటల పాటు దాడి జరిగిందని ఆరోపణ చేశారు. దాడి తర్వాత తనను అరెస్ట్ చేసి 18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదల చేసినట్లు వెల్లడించారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయలేదని విమర్శలు చేశారు. పిర్యాదు చేసిన తర్వాతే కేసు నమోదు చేశారని ఆరోపణలు చేశారు. తన ఇంటిపై దాడి, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలన్నారు.

## ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్.

అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీల్‌ఎ÷-లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మీ మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ఎ÷-లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీల్‌ఎ÷-లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ÷-లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు. నారా లోకేశ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉక్కు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకున్నామని వెల్లడించారు. చంద్రబాబు శ్రద్ధ, చొరవతో ఏపీ శరవేగంగా దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఏపీ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థికంగా మద్దతిచ్చాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాం అని అన్నారు.

## గ్యాస్ సంక్షోభానికి చెక్... ఎల్పీజీకి బదులు పీఎన్జీ!:

వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగించుకుంటున్నారని అధికారులు వివరించగా.. దీనిని 100 శాతం వినియోగంలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలో కనీసం 10 వేల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా లక్ష్యం నిర్దేశించారు. నిలిచిపోయిన శ్రీకాకుళం – కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రికి తక్షణమే లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. వాణిజ్య రంగంలో సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'నేచురల్ గ్యాస్ పాలసీ'ని వచ్చే కేబినెట్ సమావేశం ముందుకు తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. గత ఐదు రోజులుగా గృహావసరాలకు రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నామని, మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. **పంట నష్టంపై మార్చి 26లోగా నివేదిక** అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో జరిగిన పంట నష్టంపై ప్రాథమిక వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 26వ తేదీలోగా పంట నష్టంపై పూర్తిస్థాయి అంచనాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో జీఎస్‌డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరిగిన నేపథ్యంలో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. **పాలనలో టెక్నాలజీ వినియోగంపై ప్రశంస**టెక్నాలజీ వినియోగంతో అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యే నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో తిరుమలలో క్యూలైన్ల నిర్వహణ మెరుగుపడిందని, భక్తుల నిరీక్షణ సమయం తగ్గి దాదాపు 20 శాతం అదనపు దర్శనాలు సాధ్యమయ్యాయని వివరించారు. అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుతో ప్రసాదం నాణ్యత పెరిగిందని, భక్తులు, శ్రీవారి సేవకుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన శాఖలు కూడా మెరుగైన ప్రజా సేవల కోసం ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు. ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీటీవీల ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెంచేలా చూడాలని, ఇందుకు పొరుగు రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచాలని, ప్రభుత్వ శాఖలు డేటాను సమర్థంగా వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## ఐకానిక్ టవర్‌గా అసెంబ్లీ నిర్మాణం

స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల విశిష్టతను, నిధుల సమీకరణను మంత్రి నారాయణ వివరించారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలు వెళ్లి మొత్తం అమరావతి నగరాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని ఉత్తమ అసెంబ్లీ భవనాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.అసెంబ్లీ, హైకోర్టుతో పాటు మరో ఐదు ఐకానిక్ టవర్లను అత్యద్భుతంగా నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ భవనాలు కాబట్టి సాధారణ భవనాల కంటే వీటికి ఖర్చు కొంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ఐకానిక్ భవనాల రేట్లతో పోల్చి వీటిని చూస్తున్నామని, ఎస్ఆర్ (÷ూఖీ) రేట్ల ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజధాని పనుల కోసం భారీ ఎత్తున నిధులను ప్రభుత్వం సమకూర్చుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ. 11 వేల కోట్లు సమకూర్చుకుంటున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

నంది పత్రిక

మంగళవారం 24-03-2026

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు





**శ్రీశైలం మార్చి 23(నంది పత్రిక)** లోక కల్యాణార్థం పంచమఠాలలో ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి.కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



**శ్రీశైలం మార్చి 23 (నంది పత్రిక)** లోకకల్యాణం కోసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈ (23.03.2026) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

## షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా నివాళులు

### ఎఐఎస్ఎఫ్-- ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహణ.



**బేతంచెర్ల మార్చి 23 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణంలో ఎఐఎస్ఎఫ్ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ) కార్యాలయం నందు ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్.యన్నా అధ్యక్షతన స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుగుదేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్న హాజరై, భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరంవారు మాట్లాడుతూ ఉక్కు కండరాలు, విద్యుత్తు నరాలున్న యువతరం, ఈ దేశానికి కావాలని, నెత్తురు మండే శక్తిని నింపుకొని, ఈ సమాజపు చీకటి కుంపటి నుంచి, నవతరం ముందుకు రావాలని, ఈ దేశంలో 30 కోట్లకు పైగా ఉన్న యువత,యువశక్తి మొడువారి పోయిందని,అశ్లీల చిత్రాల చిందుల్లో మునిగి,మత్తు మందులో ఊగిసలాడుతున్నారు.స్వార్థ రాజకీయ నేతల వలలో పడి నేరస్తులుగా, మాఫియాలుగా మారి నేరస్తులుగా జీవితాలు గడుపుతున్నారని అన్నారు. అవినీతి,నిరక్ష్యరాశులుగా నిరుద్యోగులుగా పేదరికం దారిద్ర్యం,కపట కన్నీళ్లు,గుట్కాలు,సినిమాలు,మనిషి, మనిషిని హీనంగాచూసే ఈ దౌర్భాగ్యం కులం,మతం,ప్రాంతీయ భాషయువతనుపట్టిపీడిస్తున్నదని, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, పేరుతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం మతకలహాలు సృష్టించి హిందూ,ముస్లిం, క్రైస్తవ్యం పేరుతో యువతను ప్రజలను రెచ్చగొట్టి ధమనకాండ సాగుతున్నదని, ఈ పాలన దొంగలకు, దొరలకు నిలయమైందని, నాడు బ్రిటిష్ పాలనపై సమరభేరి మ్రోగిస్తే, ఈనాడు యువత అవినీతిని ఆహ్వానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దిక్కుమాలిన ఈ వ్యవస్థ మీద పోరాటానికి స్పందించాలని దేశభక్తితో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా.తిరుమలేష్, డి.దస్తగిరి, సిపిఐ నాయకులు సోమన్న, రైతు సంఘం జిల్లా నాయకులు రామచంద్రుడు, ఎల్లకేశవులు ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ మండల నాయకులు మధు,ఎలకృష్ణ, ప్రదీప్,కార్తీక్,రాజు,సూర్య,విష్ణు, దుర్గ,సమీర్,గంగాధర్,జగన్, మోహిద్దీన్,రఫీ,మోహన్,మురళి,చరణ్,గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్యాపిలిలో రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు



**నంది పత్రిక -ప్యాపిలి** శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ప్యాపిలిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి దేశపు ఎడ్ల బండలాగుడు పందెముల కోసం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు కలచట్ల రోడ్డులో ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. మొదటి బహుమతి రూ. 40,000/ దాతలు ఎస్.వి.టి.టమోటా మార్కెట్, ప్యాపిలి శివ, చంద్ర బ్రదర్స్, సోము, రాము, వినయ్. రెండవ బహుమతి రూ. 30,000/ దాతలు కీ.శే. చల్లా నాగరాజు కుమారులు చల్లా అంజన ప్రసాద్, చల్లా రాఘవేంద్ర, చల్లా శ్రీనివాసులు, మూడవ బహుమతి రూ.25,000/ దాతలు బోరెడ్డి పుల్లారెడ్డి, గడ్డం భువనేశ్వర రెడ్డి,నాలుగవ బహుమతి రూ.20,000/ దాతలు అనుమురాజు బ్రదర్స్ జంగమ్మ బ్రదర్స్,ఐదవ బహుమతి రూ. 15,000/ దాత షేక్ ఖాజాపీర్,ఆరవ బహుమతి రూ. 10,000/దాత నులక పెద్దిరాజుఏడవ బహుమతి రూ. 8,000/దాత జి. రామ్మోహన్ యాదవ్ అండ్ సన్స్,ఎనిమిదవ బహుమతి రూ. 5,000/ దాత షరాఫ్ మధుసూధన్.అన్నదాన దాతలు: కీ.శే. చల్లా నాగరాజు కుమారులు, పిక్కిలి చిన్నా ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఈ పోటీలకు అవసరమైన బండ రాయిని బంగి నాగరాజు బ్రదర్స్ సమకూర్చారు.సురేష్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు.పోటీలో పాల్గొనే వారు రూ.500/ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి జతకు15 నిమిషాల సమయం కేటాయించబడుతుంది. కేవలం మూడు చెర్నకోలాలు మాత్రమే అనుమతిస్తారు. కమిటీ నిర్ణయమే అంతిమమని నిర్వాహకులైన ప్యాపిలి రైతు సోదరులు, బీసీ కాలనీ వాసులు తెలిపారు. మరిన్ని వివరాలకు 9963069961, 9347946514 నంబర్లను సంప్రదించవచ్చు.

# జననగణనలో పొరపాట్లకు తావివ్వొద్దు.

### కమిషనర్ ఎన్. మౌర్య.



**తిరుపతి బ్యూరో చీఫ్ మార్చ్ 23 నంది పత్రిక** జననగణనలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా, పటిష్టంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులు, సిబ్బందికి సూచించారు. జనాభా గణన 2027 పై కచ్చపి ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జనన గణన చేసేందుకు 25 మందిని ఎంపిక చేశామని వారికి మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మీరందరూ శ్రద్ధగా అన్ని విషయాలను నోట్ చేసుకుని మీ కింద వచ్చే వారికి తెలిపి క్షేత్రస్థాయిలో జనన గణన చేయాలని తెలిపారు. 16 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఈ జననగణన లో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పటిష్టంగా నిర్వహించి సమగ్రమైన సమాచారాన్ని సేకరించాలని పిలుపునిచ్చారు. రెండు దశల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, మాస్టర్ ట్రైనర్లు రమాదేవి, సుధారాణి, ఉదయ్, తదితరులు ఉన్నారు.

# చంద్రపల్లెలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మార్చి 28న ప్రారంభం

**నంది పత్రిక -ప్యాపిలి** శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామంలో ఈ నెల 28-03-2026 శనివారం నాడు భారీ ఎత్తున రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక శ్రీ కోదండ రామస్వామి దేవస్థాన ప్రాంగణంలో గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో ఈ క్రీడా సంబరం జరగనుంది. ఈ పోటీలు మ్యాట్లపై నిర్వహించబడతాయ ని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల జట్లు ఆ రోజు ఉదయం 7:00 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఉదయం 8:00 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లకు ప్రవేశ రుసుము రూ. 500/ నిర్ణయించారు. మొదటి బహుమతి రూ. 30,016/దాతలు రవూఫ్, బ్రదర్స్, డోన్,రెండవ బహుమతి రూ. 25,016దాతలు మెట్టుపల్లె శ్రీనివాసులు, వడ్డేరామాంజనేయులుమూడవ బహుమతి రూ.15,016/దాత చీమల రాజు, రైతుబిడ్డ, నాల్గవ బహుమతి రూ. 5,016/దాత జి.కె.పి యూత్ క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని, అంపైర్ల నిర్ణయమే ఫైనల్ అని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఒక టీమ్‌లో ఆడిన వారు మరో టీమ్‌లో ఆడేందుకు అవకాశం లేదు. క్రమశిక్షణ తప్పినా మద్యం సేవించి ఆడినా అట్టి జట్లను పోటీల నుండి తొలగించడం జరుగుతుంది. మరిన్ని వివరాల కోసం నిర్వాహకులు సందీప్ కుమార్ 9000529393 పుల్లయ్య 6302904652 మద్దికేరి రాము 8332869381 సురేంద్ర 9573774573 లను సంప్రదించాల్సిందిగా కోరారు. క్రీడాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలని చంద్రపల్లె గ్రామ పెద్దలు ఆహ్వానిస్తున్నారు.

## కరిమద్దుల రైతుల సాగునీటి సమస్యపై మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తక్షణ స్పందన



**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 23 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం గడివేముల మండల పరిధిలోని కరిమద్దుల గ్రామ రైతులకు ఎదురవుతున్న సాగునీటి సమస్యపై రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారు సానుకూలంగా స్పందించారు. సోమవారం నాడు నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కరిమద్దుల గ్రామస్తులు, రైతులు మంత్రి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ పొలాలకు నీరు అందక పడుతున్న ఇబ్బందులను, సాగునీటి ఎద్దడిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్ అక్కడికక్కడే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గారితో ఫోన్లో మాట్లాడారు. కరిమద్దుల రైతుల సమస్యను వివరించి, సాగునీటి విడుదలపై చర్చించారు. అనంతరం సాగునీటి శాఖ సీఈ (జజు) కబీర్ భాష గారితో మాట్లాడి, క్షేత్రస్థాయిలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి త్వరితగతిన రైతులకు నీరు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కరిమద్దుల గ్రామ రైతుల సమస్యను అత్యంత త్వరగా పరిష్కరించి, పంటలకు నీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూల స్పందన పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ఈశ్వర్ రెడ్డి, రైతులు పూల చంద్రారెడ్డి, నాగ మల్లయ్య, శివారెడ్డి, చంద్రారెడ్డి మరియు గ్రామ రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు.



### కమిషనర్ ఎన్. మౌర్య.

**తిరుపతి బ్యూరో చీఫ్ మార్చ్ 23 నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 26 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 13 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా ఐ ఎస్ మహల్ వద్ద గల తుడా అపార్ట్మెంట్ కామన్ ఏరియా ను ఆక్రమించి గుడి నిర్మిస్తున్నారని, వర్షాలు వస్తే గాయత్రి నగర్, శ్రీకృష్ణ నగర్ లో ఒక అడుగు లోతు నీరు నిలుస్తున్నాయి రోడ్లు వేయించాలని, ఇందిరా మైదానం వద్ద టెంకాయల వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉంది చర్యలు తీసుకోవాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, మహిళా యూనివర్సిటీ వద్ద మా స్థలం లో వేరేవాళ్ళు అక్రమ నిర్మాణం చేస్తున్నారు ఆపాలని, రాజీవ్ గాంధీ కాలనీ లోని కనికలమ్మ గుడి వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం అడ్డుకోవాలని, అమెరికన్ బార్ సమీపంలో ఉన్న మటన్ దుకాణం వద్ద రోడ్డుపై రక్తం పడడంతో ఇబ్బందిగా ఉంది చర్యలు తీసుకోవాలని, మల్లయ్య గుంట వద్ద పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని, యర్రమిట్టలో కుక్కల సమస్య పరిష్కరించాలని, యూడీఎస్ ఓవర్ ఫ్లో ను అరికట్టాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, ఉన్నారు.



## ఎఐటియుసి జిల్లా ప్రథమ మహాసభల కరపత్రాలు విడుదల.



**బేతంచెర్ల మార్చి 23 ( నందిపత్రిక).** నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఏప్రిల్ నెల 5 మరియు 6 వతేదీలలో జరుగ బోయే ఎఐటియుసి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని,బేతంచర్ల మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టి ( సిపిఐ ) కార్యాలయం నందు, ఎఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్ యన్న, ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు సూర్య చంద్ర, తాలూకా తిరుమలేష్ ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ లు కలిసి

**ఎఐటియుసి జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు.** జిల్లా విభజన తర్వాత గత మూడు సంవత్సరాల కాలంలో కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం,అనేక ఉద్యమాలను చేపట్టి కార్మికులకు,ఉద్యోగులకు ఎఐటియుసి ఎర్రజెండా అండగా నిలబడి పోరాటం చేసిందని, రానున్న రోజుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలను నిర్వహించేందుకు నందికొట్కూరులో జరిగే మహాసభలో చర్చించి,భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందిస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. దేశాన్ని,రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న పిఎం. నరేంద్ర మోడీ ,సిఎం. చంద్రబాబు నాయుడు,డిప్యూటి సిఎం. పవన్ కళ్యాణ్ లు, దేశంలో అనేక ఏండ్ల క్రితంనుండే ఉద్యోగ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాలను,నాలుగు కోడ్లు గా మార్చి,కార్మిక ఉద్యోగ హక్కులను హరించారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పారని,కార్పొరేట్లకు కొమ్ము కాస్తు, 8 గంటల పని విధానాన్ని తుంగలో తొక్కి,రోజుకు 12 గంటలు పని చేయాలని అతివేగంగా చట్టాన్ని తీసుకురావడం అంటే,కార్మికుల ఉద్యోగుల శ్రమ దోపిడీ చేయడం, బానిసలుగా చేయడం దుర్మార్గమని, ఈ పాలకుల వ్యతిరేక విధానాలపై మరింత తీవ్రమైన ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### సుంకేశ్వరి గ్రామంలో రూ. 10లక్షల తో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజచేసిన టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి



**మంత్రాలయం , న్యూస్ :-** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో వ్యవసాయ అధికారి జీరాగణేష్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతన్న మీ కోసం వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని "రైతన్న మీ కోసం వారోత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో రైతులను కలుసుకుని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పంచసూత్రాలు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి రైతు సంక్షేమ పథకాల ద్వారా రైతులకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలో సీసీరోడ్లు , డ్రైనేజీ పనులకు భూమి పూజ :- రైతన్న మీ కోసం వార్షికోత్సవంలో భాగంగా గ్రామంలో రూ. 10 లక్షల తో నిర్మిస్తున్న సీసీరోడ్లు , డ్రైనేజ్ పనులకు మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి , టీడీపీ యువ నాయకులు ఎన్. రాజారెడ్డి తో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామాలాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చావిడి వెంకటేష్ , లక్ష్మయ్య , లక్ష్మన్న , మాలపల్లి చంద్ర , సుంకేశ్వరి గ్రామ టీడీపీ నల

## రోడ్డు ప్రమాదాలలో ఇరువురి దుర్మరణం





**బండి ఆత్మకూరు నంది పత్రిక మార్చి 23 :** బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేరువేరు రోడ్డు ప్రమాదాలలో ఇరువురు మృతి చెందారని ఎస్సై జగన్మోహన్ సోమవారం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోనపల్లి గ్రామానికి చెందిన బాలకిట్టమ్మ (43) అనే మహిళ రోడ్డు నిర్మాణ పనులకు గాను ఇక్కడికి వచ్చిందని ఎస్ఐ తెలిపారు. సదర్ మహిళ దూదేకుల మౌలాలి అనే వ్యక్తి యొక్క మూడో సైకిల్ పై వెళుతూ ఉండగా మోటార్ సైకిల్ డ్రైవరు అతివేగంగా అ జాగ్రత్తగా మోటార్ సైకిల్ నడుపుతూ, మోటార్ సైకిల్ పై నుండి మహిళను కింద పడవేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. దీంతో బాల కిట్టమ్మ తలకు బలమైన రక్త గాయాలు అయ్యాయని పేర్కొన్నారు. మౌలాలికి కూడా పాక్షికంగా గాయాలయ్యాయని పేర్కొన్నారు. మౌలాలిది కృష్ణారావుపేట పాములపాడు మండలం అని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సంఘటన ఈ నెల 21వ తేదీన జరిగిందని మహిళను వెంటనే కర్నూలు జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయిందని ఎస్ఐ పేర్కొన్నారు. నాయిని చెరువు, ఓంకారానికి చెందిన ఈదన్న (25) ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం ఈర్నపాడు గ్రామంలో పని ఉన్నదని చెప్పి మోటార్ సైకిల్ పై వెళ్లి పని ముగించుకొని తిరిగి వస్తూ ఉండగా సంజీవరెడ్డి పొలం వద్ద మోటార్ సైకిల్ పై నుండి కింద పడ్డాడని ఎస్ఐ తెలిపారు. ఈదన్నకు చాతిపై తలపై గాయాలు అయ్యాయని చికిత్స నిమిత్తం అతనిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగిందని పేర్కొన్నారు చికిత్స పొందుతూ ఈదన్న ఆదివారం రాత్రి మృతి చెందడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. రెండు సంఘటనలకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జగన్మోహన్ పేర్కొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తాం

### యువత ఆదర్శప్రాయుడు భగతసింగ్
### భగత్ సింగ్ ఆశయాలను సాధిస్తాం



**నంద్యాల ప్రతినిధి. మార్చి 23 . (నంది పత్రిక ):**విప్లవ కెరటాలు భగత్ సింగ్ రాజ్ గురు, సుఖదేవ్ ల 95 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు రఫీ అర్పిం చారు.స్థానిక నంద్యాల పట్టణం సాయిబాబా నగర్ సమీపంలో ఉన్న పి.డి.ఎస్.యు కార్యాలయంలో సోమవారం సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వర్ధంతి సందర్భంగా పి.డి.ఎస్.యు నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాపి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.యం.డి.రఫీ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన వ్యక్తి సర్దార్ భగత్ సింగ్ అని స్వాతంత్రం మా జన్మహక్కుని బ్రిటిష్ పార్లమెంట్ మీద ఒక మందు గుండు బాంబును విసిరి తన నిరసన తెలిపిన వ్యక్తి భగత్ సింగ్ అని ఉద్ఘాటించారు,అత్యంత చిరుప్రాయంలో 22 ఏళ్ల వయసులో భారతదేశం కోసం తన ప్రాణాల సైతం లెక్కచేయకుండా ఉరి కంబాన్ని ముద్దాడిన విప్లవ వీర కిశోరాలు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, ఆశయాల కోసం పి.డి.ఎస్.యు నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. బ్రిటిష్ సామ్రాజవాదుల నుండి మాతృభూమి విముక్తి కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించారని, వారిలో అగ్ర ఘన్యులు కామ్రేడ్ భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ లని, 1931 మార్చి 23న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వీరి ముగ్గురిని క్రూరంగా ఉరితీసారన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నాడు ప్రవేశపెట్టిన మోకాలే విద్యా విధానమే నేటికీ కొనసాగుతుందన్నారు. విద్య సామాజిక అవసరాలకు కాకుండా కార్పొరేట్ కాషాయ శక్తుల అవసరాలకు అనుకూలంగా నేడు విద్యారంగాన్ని కాషాయ పాలకుల మారుస్తున్నారుని కేంద్ర 20 శాతం రాష్ట్ర బడ్జెట్ 30 శాతం జీడిపిలో 6శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ఆ నిధులను కేటాయించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్, పట్టణ కార్యదర్శి లక్ష్మీకాంత్ ,నంద్యాల పట్టణ నాయకులు సుభాన్, హరి, నాయక్, కిరణ్, వినయ్, బాలాజీ, ధను, తదితరులు పోల్గొన్నారు .

## వచ్చే నెల నుండి మీ ఇంటికి -మీ డాక్టర్



**బండి ఆత్మకూరు నంది పత్రిక మార్చి 23:** వచ్చేనెల ఏప్రిల్ నుండి బండి ఆత్మకూరు మండలంలో మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్ట నున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు గాను వినూత్నమైన రీతిలో మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా నంద్యాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమాన్ని వచ్చేనెల నుండి బండి ఆత్మకూరు మండలంలో ని 15 గ్రామాలలో చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ ద్వారా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ద్వారా సిఎస్ఆర్ నిధుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ మొబైల్ టీం లో ఒక డాక్టరు నర్సు ఫార్మసిస్టు డ్రైవర్ అందుబాటులో ఉండి పేదలకు ఆరోగ్య సేవలను అందిస్తారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. బండి ఆత్మకూరు మండలంలో గిరిజన ప్రాంతాలతో పాటు మిగతా గ్రామాలలో కూడా సేవలను అందిస్తారు. మొబైల్ టీమ్ లో ఉన్న 5 మంది సభ్యులు గ్రామీణ ప్రాంతాలలో పర్యటించి సేవలు అందిస్తారని వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. వీరు అందించే సేవలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదు అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో మొబైల్ టీం సిబ్బంది సఖ్యతతో మెలిగి వారికి సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని టీం సభ్యులకు కలెక్టర్ సూచించారు. అయితే సంబంధిత వైద్యాధికారులకు ఇందుకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలు అందేలా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు.

## అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపండి

### జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

**వై ఎస్ ఆర్ కడప బ్యూరో చీఫ్ ,మార్చి 23 నంది పత్రిక** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీలకు అధికారులు వారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు..సోమవారం కలెక్టరేట్ లోని సభాభవన్ సమావేశపు మందిరం నందు..ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

**ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...** అర్జీదారులు వారి సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో అర్జీలు సమర్పించడంజరుగుతుందని వారికి నాణ్యమైన,సంతృప్తి స్థాయి లో పరిష్కారం చూపే విషయంలో అధికారులు శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ను ఇచ్చి నిర్వహిస్తోందని,ఇందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగాపరిష్కరించాలన్నారు. ఎండార్స్ మెంట్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.జిల్లా అధికారులు వారికి అందిన అర్జీల పరిష్కారానికి సమయం కేటాయించి సమీక్షా చేయాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.. పెద్దనపాడు, ఎర్రగుంట్ల మండలానికి చెందిన గంజికుంట వెంకటేష్ తమ భూమికి సంబంధించిన నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ప్రొద్దుటూరు మండలానికి చెందిన కృష్ణమూర్తి తమ ఇంటి పక్కన ఉన్నవారు మురుగు నీరు పోకుండా అడ్డుకట్ట వేసిన సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు.కడప జిల్లాకు చెందిన కె. అంజలి తమ కూతురికి గురుకుల పాఠశాలలో సీటు కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఓబులమ్మ,కో- ఆపరేటివ్ శాఖ అధికారి వెంకటసుబ్బయ్య,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

**కొత్తపల్లి - నంది పత్రిక:** శ్రీరామ నవమి పండుగ మరియు రథోత్సవం సంధర్భంగా మండలంలోని ఎదురుపాడు గ్రామంలో మార్చి 30 వ తేదీ సోమవారం అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు(4 పల్ల విభాగం) నిర్వహిస్తున్నట్లుగా గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు దాతల ద్వారా నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.40,000 లు, రెండవ బహుమతి రూ.30,000 లు, మూడవ బహుమతి రూ.20,000 లు, నాల్గవ బహుమతి రూ.15,000 లు, ఐదవ దు బహుమతి రూ.10,000లు, ఆరవ బహుమతి రూ.5000 దాతలచే బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే వారు మార్చి 30 వ తేదీ సోమవారం ఉదయం 6.30 గంటలలోపు ఎంట్రీఫీజు రూ.500లు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని గ్రామ పెద్దలు,కమిటీ మెంబర్ లు తెలిపారు వివరాలకు 9885036724 9052059489 8142232830 సంప్రదించాలన్నారు.

## పాఠశాల రూపురేఖలు మార్చిన సీఆర్పీఎఫ్ పోలీస్ ఉదారత:

### మధుశావళిని అభినందించిన యూటీఎఫ్ నాయకులు




**నంది పత్రిక - ప్యాపలి** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని కోరుతూ,పాఠశాల భక్తిని చాటుకున్నారు ఒక సీఆర్పీఎఫ్ పోలీస్ ప్యాపలి మండలం రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల రూపురేఖలను మార్చడంలో ఆయన చూపిన చొరవ అందరికీ ఆదర్శంగా నిలిచింది. రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల భవనం పెయింటింగ్ లేక, కనీసం పాఠశాల పేరు కూడా కనిపించని దయనీయ స్థితిలో ఉండేది. ఈ పరిస్థితిపై ఆవేదన చెందిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ నాయక్, ఇదే గ్రామానికి చెందిన, ప్రస్తుతం సీఆర్పీఎఫ్ లో పనిచేస్తున్న మధుశావళి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన మధుశావళి, సుమారు ₹24,000 విరాళంగా అందజేసి పాఠశాల భవనానికి రంగులు వేయించి కొత్త కళను తెచ్చారు. "నేను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి నా వంతు సహాయం చేయడం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది" అని ఈ సందర్భంగా మధుశావళి పేర్కొన్నారు. **ప్రశంసల జల్లు** సామాజిక స్పృహ కలిగిన నాయకుడిగా, యూటీఎఫ్ మండల కార్యవర్గ సభ్యుడిగా ఉంటూ పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ నాయక్ చొరవను గ్రామస్తులు కొనియాడారు. ఈ సందర్భంగా దాత మధుశావళిని పాఠశాల సిబ్బందిని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ లతీఫ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు భార్గవి, యూటీఎఫ్ మండల నాయకులు రాజేంద్ర, అమీర్, రహీం, శేషయ్య, మదన్ గోపాల్ పాల్గొన్నారు.



## పేదలందరికీ 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి.

### ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు నిధులు ఇవ్వాలి

### 24వ తేదీ సిపిఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కు తరలి రండి.




**నంద్యాల ప్రతినిధి. మార్చి 23 . (నంది పత్రిక ):**కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని, పట్టణంలోని ప్రతి పేదవాడికి 2 సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వార్డు వార్డునా తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచారు. గతంలో పట్టణంలోని వార్డు సచివాలయాల వద్ద ఇంటి స్థలాల కోసం అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో పాల్గొని, 24వ తేదీ (మంగళవారం) నిర్వహించనున్న తహసీల్దార్ కార్యాలయం ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమం ఉదయం పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్ నుండి భారీ ర్యాలీగా ప్రారంభమై శ్రీనివాస సెంటర్, రాజ్ థియేటర్, టెక్కే మార్కెట్ యార్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగుతుందని నాయకులు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పి. మురలీధర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి. సోమన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జి. లక్ష్మీదేవి, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి పి. సుశీలమ్మ, సిపిఐ నాయకురాలు సరోజమ్మ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జి. హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా అమ్మవారి జ్యోతి ఉత్సవాలు





**బనగానపల్లె మార్చి 23నందిపత్రిక** నందవరం చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలు ఆదివారం రాత్రి 1గంటనుండి అశేష భక్త జనం మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి.

**అమ్మవారికి దిష్టి చుక్క పెట్టడంతో ప్రారంభమైన జ్యోతి ఉత్సవాలు** ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో భాస్కరయ్య ఆచారి అమ్మవారికి దిష్టి చుక్క పెట్టారు. 1గంట నుండి బాణాసంచా డప్పు వాయిద్యాలు కోలాటాలు సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి జ్యోతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా తొగటవీర క్షత్రియులు బియ్యం పిండితో చేసిన జ్యోతులను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా అమ్మవారి మందిరానికి వచ్చారు. ఇతర భక్తులు కూడా జ్యోతులను నెత్తిన పెట్టుకొని బాణాసంచా డప్పుల మధ్య జ్యోతులను ఊరేగించారు . తెల్లవారు వరకు జ్యోతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి గ్రామస్తులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి తమ జ్యోతులను సమర్పించుకున్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లుగావించిన ఆలయ అధికారులు ప్రతి ఏటా ఉగాది పర్వదినం అనంతరం నందవరం చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.ఈ ఏడాది కూడా అమ్మవారి జ్యోతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ జ్యోతి ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే అమ్మవారి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పాలకమండలి సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉత్సవాలను తిలకించేందుకు మన రాష్ట్రం నుండే కాకుండా తెలంగాణ కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు వారందరూ అమ్మవారి జ్యోతి ఉత్సవాలను తిలకించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

**పోలీసుల గట్టి బందోబస్తు** అమ్మవారి జ్యోతి ఉత్సవాలకు మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బనగానపల్లె పోలీసులు పట్టణ సి ఐ ప్రవీణ్ కుమార్ రూరల్ సిఐ మంజునాథరెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 23 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి ఫరూక్ గారి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రివర్యులు ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



## మేధో సంపత్తి హక్కులపై అవగాహన కార్యక్రమం విజయవంతం



**నంద్యాల ప్రతినిధి. మార్చి 23 . (నంది పత్రిక ):**నంద్యాలలోని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో మేధో సంపత్తి హక్కులు పై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఇన్నోవటే, ప్రొటెక్ట్, సక్సెస్స్ అనే అంశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వాటి రక్షణ అవసరాన్ని చాటిచెప్పింది.ఈ కార్యక్రమాన్ని ఆర్టీఐహెచ్ మరియు వారి బృందం సహకారంతో నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న శ్రీనివాస్ మద్దిపాటి అటార్నీ ఈవా పేటెంట్ సర్వీసెస్ మాట్లాడుతూ, ఆధునిక యుగంలో ఆవిష్కరణలు, పేటెంట్లు, కాపీరైట్స్ వంటి మేధో సంపత్తి హక్కుల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు తమ ఆలోచనలను సురక్షితంగా ఉంచుకోవడానికి ఐపిఆర్ నమోదు ఎంతో అవసరమని ఆయన తెలిపారు.ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హాఫీజ్ బాషా మరియు వారి బృందం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పరిశోధన మరియు ఆవిష్కరణలపై దృష్టి సారించి, తమ ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సుబ్రహ్మణ్యం కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ, విద్యార్థులు కొత్త ఆలోచనలను అభివృద్ధి చేయడంతో పాటు వాటిని చట్టపరంగా రక్షించుకోవడం కూడా నేర్చుకోవాలని పేర్కొన్నారు.డేటా సైన్స్ విభాగాధిపతి రమాదేవి మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో ఉన్న విద్యార్థులకు ఐ పి ఆర్ పై అవగాహన అత్యంత ముఖ్యమని, ఇది వారి భవిష్యత్తు పరిశోధనలకు మరియు స్టార్టప్‌లకు దోహదపడుతుందని తెలిపారు.

## ఇద్దరు హోంగార్డ్స్‌కు వెల్ఫేర్ ఫండ్ చెక్కులు అందజేసిన ... హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్

**కర్నూలు నంది పత్రిక.....**

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు హోం గార్డ్స్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుండి మంజూరైన చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలోని హోంగార్డు కమాండెంట్ కార్యాలయంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్ ఇద్దరు హోంగార్డులకు సోమవారం అందజేశారు.

**మెడికల్ గ్రాంట్ క్రింద**కర్నూలు యూనిట్ కు చెందిన హోం గార్డు పి. సురేష్ కుమార్ కు రూ. 10 వేలు,మహిళా హోం గార్డు వి. భారతి కి రూ. 10 వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇంచార్జ్ కర్నూలు యూనిట్ ఎస్.ఎల్.కాంతరెడ్డి , జూనియర్ అసిస్టెంట్ కె. మాధవి రాణి, పోలీసు సిబ్బంది మరియు హోం గార్డ్స్ పాల్గొన్నారు.



## సిబ్బంది సమయపాలన పాటించాలి

**- సచివాలయాల డీప్యూటీ ఎంపీడీఓ కె.పీ.ఆర్ శర్మ**



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని సచివాలయాల డీప్యూటీ ఎంపీడీఓ కె.పీ.ఆర్ శర్మ సూచించారు. సోమవారం మండలంలోని నందికుంట. కొత్తపల్లి గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టార్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని సూచించారు. అదేవిధంగా ఏమైన పనులపై బయటి వెలితే మూమెంట్ రిజిస్టర్ నందు సమయం కచ్చితంగా కనపర్చాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఎవ్వరైనా సమయపాలన పాటించకపోయిన, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో జాప్యం వహించిన తప్పకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సచివాలయాల్లో జరుగుతున్న ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆధార్లో చేర్పులు మార్పులు చేసుకొనే వారి వివరాలను తప్పులులేకుండా నమోదు చేయాలని సూచించారు.

## ప్రశాంతంగా పదిపరీక్షలు



**కొత్తపల్లి - నంది పత్రిక:** పదవతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం గణితశాస్త్ర పరీక్షకు కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల పరీక్షా కేంద్రంలో 158 మందకి గాను 158 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. అదేవిధంగా గోకవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం నందు 91 మంది విద్యార్థులకు గాను 87 మంది హాజరు కాగా 4 విద్యార్థులు గైహాజరు అయినట్లు ఆ కేంద్రం పరీక్షల నిర్వహణాధికారి వెంకటస్వామి చెప్పారు. కాగా కొత్తపల్లి, గోకవరం పదవతరగతి పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎస్.బ్రహ్మం నాయక్, తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయాలేదా అని ఆరా తీశారు. ఏ విద్యార్థికూడా మాస్ కాఫీంగ్కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాలలో అన్ని' వసతలు కల్పించాలని చెప్పారు. ఆయన వెంట ఫ్లైయింగ్స్క్వాడ్ డీప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి, ఎంఈఓ- 2 ఇనాయతుల్లా ఉన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...



**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 85 ఫిర్యాదులు.**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ.**

**కర్నూలు నంది పత్రిక....** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 85 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని** ...1) హైదరాబాద్ లోని టీం లీజ్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఉందని , ఫేక్ లెటర్ ఇచ్చి రూ. 4 లక్షల 80 వేలు తీసుకొని మోసం చేసిన కర్నూలు కు చెందిన శరత్ గౌడ్ , అనంతపురం కు చెందిన హంపి రాజుల పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, కల్లూరు మండలం కు చెందిన ఫణి ఫిర్యాదు చేశారు. 2) అనంతపురం కు చెందిన దేశ్ ముఖ్ లతీఫ్ స్నేహితుల ద్వారా పరిచయం అయి బెంగళూరు లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. 1 లక్ష 10 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు మండలం, పసుపుల గ్రామం కు చెందిన సాయి ఫిర్యాదు చేశారు. 3) సోలార్ కంపెనీలో లేదా ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని దుస్తులు, ఐడి కార్డు ఇప్పించి మోసం చేసిన ఓర్వకల్లు కు చెందిన ఒక మహిళ పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, కల్లూరు మండలం, పందిపాడు గ్రామానికి చెందిన విజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. 4) ఎమ్మిగనూరుకు చెందిన ఒక జ్యూవెలరీ షాపులో బంగారం తాకట్టు పెట్టాము, తాకట్టు పెట్టి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చాము. కానీ బంగారం ఇవ్వకుండా పరారీలో ఉన్న వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని ఎర్రకోట, కడిమెట్ల గ్రామానికి చెందిన మహేష్ , బీసన్న, పార్వతి , ఉదయ్ కుమార్ లు ఫిర్యాదు చేశారు. 5) నా పెద్ద కుమారుడు జీవన్ కుమార్ ఆస్తిని పంచి ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని గుడూరు కు చెందిన జంగం మల్లయ్య ఫిర్యాదు చేశారు.

6) శ్రేయాస్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో రూ. కోట్ల లలో పెట్టుబడి పెట్టించి మోసాలు చేసిన కర్నూలు హేమంత్ కుమార్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కర్నూలు , ధనలక్ష్మి నగర్ కు చెందిన నాగిరెడ్డి , వెంకటసుబ్బారెడ్డి మరియు తదితరులు ఫిర్యాదు చేశారు.

7) కర్నూలు సంతోష్ నగర్ లోని మా ప్లాట్ ను డబల్ రిజిష్టర్ చేసిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, సంతోష నగర్ కు చెందిన ముత్యాలమ్మ ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు శివ శంకర్ , విజయలక్ష్మి పాల్గొన్నారు.



## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు , అక్రమ పార్కింగ్, రహదారి ఆక్రమణల పై ప్రత్యేక చర్యలు...

**నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు...**



**కర్నూలు నంది పత్రిక......** సోమవారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్ పర్యవేక్షణలో కర్నూల్ ట్రాఫిక్ సిఐ మన్సరుద్దీన్ ఆధ్వర్యంలో కర్నూలు ట్రాఫిక్ పోలీసులు మరియు మునిసిపల్ కార్పోరేషన్ వారు సంయుక్తంగా కర్నూలు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కు ప్రత్యేక చర్యలు చేపట్టారు.నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన కలెక్టర్ కార్యాలయం నుండి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వరకు , తదితర ప్రాంతాల్లో వాహనదారులు మరియు పాదచారులకు కలుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా రహదారులను ఆక్రమించిన తోపుడు బండ్లు, అనధికారిక పార్కింగ్‌లు మరియు ఇతర అడ్డంకులను తొలగించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రహదారులపై వాహనాలను అడ్డంగా నిలపకుండా ఉండాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ట్రాఫిక్ ఆర్ ఎస్సై, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

# జనగణన2027కు పకడ్బంది సన్నద్ధత.






## గృహ జాబితా, గృహ జనగణన ప్రక్రియలపై అధికారులకు సమగ్ర శిక్షణ

### జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.

**కర్నూలు, నంది పత్రిక....** దేశాభివృద్ధికి కీలకం జనగణన2027 అని, అధికారులు గృహ జాబితా, గృహ జనగణన ప్రక్రియలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. సోమవారం జనగణన2027 తొలి దశలో నిర్వహించనున్న గృహ జాబితా మరియు గృహ జనగణన కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు సంబంధించి ఫీల్డ్ ట్రైనర్స్ మరియు సంబంధిత అధికారులకు కర్నూలులోని జి. పుల్లయ్య ఇంజినీరింగ్ & టెక్నాలజీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమైనదని, అందువల్ల ప్రతి వివరాన్ని పకడ్బందీగా, ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. 2011లో నిర్వహించిన జనగణనతో పోలిస్తే, ఈసారి పద్ధతులు మరియు సాంకేతిక విధానాలు భిన్నంగా ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా, గతంలో భౌతిక ఫారాల ద్వారా వివరాలు సేకరించగా, ప్రస్తుతం పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో సమాచారాన్ని నమోదు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కాబట్టి ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండడం అత్యవసరమని పేర్కొన్నారు. జనగణన నిర్వహణ కోసం ప్రతి మండల స్థాయిలో ఇద్దరు అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ఈ అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేసే ఎన్యూమరేటర్లకు సమగ్ర శిక్షణ అందించి, వారు ఖచ్చితంగా విధులు నిర్వహించేలా చూడాలని సూచించారు. జనగణన ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమాలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలో ఎన్నికల ప్రక్రియతో పాటు జనగణన కూడా అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రక్రియ అని, దీని ద్వారా దేశంలోని ప్రతి పౌరుడి వివరాలను సమగ్రంగా సేకరించి, దేశ అభివృద్ధి రూపకల్పనకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ దివాకర్ బరిహ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. జి.వి కృష్ణ, మాస్టర్ ట్రైనర్స్ గోవింద రెడ్డి, సర్వేశ్వర రెడ్డి, షేక్ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్





**కర్నూలు, నంది పత్రిక......** అణగారిన వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకట్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జాయింట్ కలెక్టర్ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సేవా రంగంలో మరియు అణగారిన వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.. దొమ్మేటి వెంకటరెడ్డి తన జీవితాన్ని సమాజ సేవకే అంకితం చేశారని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పేదరికం, నిరక్షరాస్యతను దూరం చేసేందుకు విద్య ఒక్కటే మార్గమని నమ్మి, దానికోసం ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. మయన్మార్‌లో వ్యాపారవేత్తగా ఎదిగినా, తన సంపాదనను సమాజ సంక్షేమానికి, పేద విద్యార్థుల చదువులకే వెచ్చించిన మహోన్నత వ్యక్తి అన్నారు. పేద ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయడమే మనం ఆయనకు నివాళు లురపించడం అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ , బిసి సంక్షేమ అధికారి ప్రసూన, సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, ఐసిడిఎస్ పిడి విజయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించండి

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



**కర్నూలు, నంది పత్రిక....** ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దరఖాస్తును పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి పరిశీలించి పరిష్కరించాలన్నారు. చేయలేదన్నారు.. అర్జీదారులకు అందజేసే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా, ఉండాలని పేర్కొన్నారు. రీ–ఓపెన్ అయిన అర్జీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, అవి మళ్లీ పెండింగ్‌లో పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డి ఆర్ ఓ సి. వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి





### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**కర్నూలు నంది పత్రిక.....** జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకొని వారికి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం అనంతరం నైపుణ్యం అభివృద్ధి మరియు శిక్షణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి మరియు శిక్షణ శాఖ వారి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలో భాగంగా వివిధ రకాలైన 16 ప్రైవేటు కంపెనీలలో ఉన్న 1110 ఖాళీలను భర్తీ నిమిత్తం ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల బి.క్యాంప్ ,కర్నూలు లో16 వివిధ రకాల ప్రైవేటు కంపెనీలలో ఉన్న 1110 ఖాళీలను భర్తీ కొరకు మార్చి 30 వ తేది, ఉ.9:30 గం.ల నుండి సా.4గం.ల వరకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. సదరు జాబ్ మేళా లో పాల్గొనాలనుకునే యువతీ, యువకులు 18 సం.ల నుండి 35 సం.ల లోపు ఉండడంతో పాటు పదవ తరగతి నుండి డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా,బిటెక్, పిజి చదివిన వారు జాబ్ మేళాలో పాల్గొని ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు.

అందుకు గాను ముందుగా చీఋఱజూబఅఋఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ లింక్ లో సదరు వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారిణి దీప్తి మాట్లాడుతూ జాబ్ మేళాను యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. జాబ్ మేళాలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న నంబర్లకు సంప్రదించగలరని తెలిపారు. 6300009183, 8374231357 కార్యక్రమంలో ఱ=హ నారాయణమ్మ ఉపాధి కల్పన అధికారి దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి.



**వెలుగోడు, మార్చి 23 నంది పత్రిక:** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. సోమవారం వెలుగోడు గ్రామంలోఅఱ స్థానిక దాసరిపేటలో వ్యవసాయ అధికారి స్వాతి ఆధ్వర్యంలో 'రైతన్న మీ కోసం' వారోత్సవాలలో భాగంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని 'రైతన్న మీ కోసం' వారోత్సవాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అనంతరం గ్రామంలోని రైతులను స్వయంగా కలుసుకుని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలపై ముఖ్యంగా పంచసూత్రాలు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాల ద్వారా రైతులకు అందుతున్నాయా లేదా అని ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన మార్కెటింగ్, సాగునీటి భద్రత, ప్రకృతి వ్యవసాయం వంటి రైతులతో చర్చించారు. ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని, రైతుల అభ్యున్నతికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మండల సమన్వయకర్త అన్నారపు శేషిరెడ్డి, వంగాల కృష్ణారెడ్డి, మండ్ల శంకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అబ్దుల్ కలాం, పట్టణ అధ్యక్షులు మోమిన్ రసూల్, మాజీ ఎంపీటీసీ డాక్టర్ జాకీర్ హుస్సేన్, క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసులు గౌడ్, డిప్యూటీ ఎంపీడీవో, చాంద్ బాషా,జనసేన శాలు భాష, సూర్యనారాయణ, తెలుగు రమణ, బిజెపి పోతుల రాజశేఖర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి మల్లి నరేంద్ర, హౌసింగ్ ఏఈ శ్రీను, ఆసార్ వజీర్, మాజీ ఎంపీటీసీ రాజి, టైలర్ సయ్యద్, సంజీవరాయ ప్రసాద్, బలుసా రాము, బంకు శీను, మాజీ ఎంపీటీసీ అజమతుల్లా, అమీర్ హంజా, బియ్యం ముర్తుజా, ఎల్లాల కృష్ణుడు, అమీర్ ఖాజా, అమీర్ ఖాజా, ఆసిఫ్, రఫీ వంటి కూటమి నాయకులు ఉన్నారు.

# ప్రతి యేట జాబ్ క్యాలెండరు ఏది బాబు?

### ఉగాది రోజు జాబ్ క్యాలెండరు అంటూ

### నిరుద్యోగులను నిలువునా ముంచిన కూటమి ప్రభుత్వం

### పత్రికా సమావేశంలో వైసీపీ జిల్లా అధికారప్రతినిధి

**బనగానపల్లెమార్చి 23నందిపత్రిక** నిరుద్యోగులకు ప్రతి యేట ఉగాదికి జాబ్ క్యాలెండరు విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఇప్పుడు ఆ ఊసే ఎత్తకుండా నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి సిద్ధం రామ్మోహన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం బనగానపల్లెలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నందు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ అధికార ప్రతినిధి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డితో పాటు,రాష్ట్ర వైఎస్సార్సీపీ యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి బనగానపల్లె మండల యూత్ అధ్యక్షుడు తూర్పింటి శ్రీనివాస రెడ్డి,కోవెలకుంట్ల మండల వైఎస్సార్సీపీ యూత్ అధ్యక్షుడు సింగారెడ్డి రాంభూపాల్ రెడ్డి,యూత్ లీడర్ ధనికొండ నాగేశ్వర్ రెడ్డి,వాణిజ్య విభాగం అధ్యక్షుడు గోపిరెడ్డి నాగేష్ రెడ్డి,మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు గున్నాల శేష జస్వంత్ రెడ్డి,అవుకు మండల యూత్ అధ్యక్షుడు మూరం నర్సిరెడ్డి,జనార్దన్ రెడ్డి,జాకీర్,రియాజ్,కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు చేస్తున్న దగా పై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల కాలంలో పబ్లిసిటీ తప్ప...చేసింది ఏమి లేదు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆకలి మంటలతో ఎదురు చూస్తున్నారని,సంవత్సరానికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీలు ఏమయ్యాయి బాబు అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు వాలంటీర్లు కు 10,000 వేలు ఇస్తామన్నారు. అయితే వారికీ 10 వేల వేతనం ఇచ్చారా లేదే అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతికి నెలకు 1500 వందల రూపాయలు ఇస్తామన్నారు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ యువత కోసం వైఎస్సార్సీపీ పార్టీ తరుపున పోరాటాలు చేస్తామని తెలిపారు.




# నగర పంచాయితీ సాదారణ కౌన్సిల్ సమావేశం.



**బేతంచెర్ల మార్చి 23 ( నందిపత్రిక ).** బేతంచెర్ల నగర పంచాయితీ సాదారణ కౌన్సిల్ సమావేశము 25/3/2026 బుధవారం 10 గంటలకు గౌరవ ఛైర్ పర్సన్ సిహెచ్. చలంరెడ్డి అధ్యక్షత,ననగర పంచాయితీ కార్యాలయం నందు జరుగును. వార్డు కౌన్సిలర్లు, నగర పంచాయితీ అధికారులు సకాలంలో హాజరు కావలయునని నగర పంచాయితీ కమీషనర్ హరిప్రసాద్ సోమవారం తెలియ జేశారు.

# ప్రజల ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించండి

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**కర్నూలు, నంది పత్రిక....** ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దరఖాస్తును పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి పరిశీలించి పరిష్కరించాలన్నారు.చేయలేదన్నారు.. అర్జీదారులకు అందజేసే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా, ఉండాలని పేర్కొన్నారు. రీ–ఓపెన్ అయిన అర్జీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, అవి మళ్లీ పెండింగ్‌లో పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డి ఆర్ ఓ సి. వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ జల దినోత్సవ వేడుకలు"





**కర్నూలు నంది పత్రిక....** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ సర్వీస్ యూనిట్ మెంబెర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బి. క్యాంపు నందు గల గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఫర్ మెన్ నందు జిల్లా న్యాయసేవాదికారసంస్థ, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, లయన్స్ క్లబ్ అఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ జల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సదస్సులో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ త్రినాథ్ కుమార్ మాట్లాడుతూ నీటి ప్రాధాన్యత దాని సంరక్షణ పై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం గా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగానీటికి సంబంధించిన సమస్యలను గుర్తించడం తోపాటు నీరు, పారిశుద్ధ సంక్షోభాన్ని వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టడం ఈరోజు యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనాలసిస్ట్ ఇమ్రాన్ మాట్లడుతూ నీటి నిర్వహణలో మహిళలు మరియు బాలికల పాత్రను, నీటి సంక్షేమం వారిపై చూపే ప్రభావం,భూగర్భ జలాలను పెంచడం, నీటి కాలుష్యం తగ్గించడం, నీటి పొదుపు అలవాట్లను ప్రోత్సహించడం మరియు వర్షపు నీటి నిలువ లను పెంచడంపై ప్రజలు దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ సర్వీస్ యూనిట్ మెంబర్ లయన్స్ క్లబ్ అఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి లయన్స్ జిల్లా గవర్నర్ అడ్వైసర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో "నీటి కాలుష్య నివారణలో యువత పాత్ర మరియు వినియోగదారుల హక్కుల పై" నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను, షిల్డ్ లను డిప్యూటీ కలెక్టర్ త్రినాథ్ కుమార్ చేతుల మీదుగాప్రదానం చేసారు . ఈ సదస్సులో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా ప్రశాంతి, వైస్ ప్రిన్సిపల్స్ హేమంత్, సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనాలసిస్ట్ ఇమ్రాన్ మరియు బిపిఓ పవన్, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ ఫక్రున్నీసా బేగం, గవర్నమెంట్ వోకేషనల్ కాలేజ్ ప్రిన్సిపల్ నాగ స్వామి నాయక్, కామర్స్ డిపార్ట్మెంట్ హెడ్ నాగన్న, లెక్చరర్ ఇన్ పొలిటికల్ సైన్స్ నాగరత్నమ్మ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## భూసర్వే లో కచ్చితత్వం కోసం కంటిన్యూయస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్‌కోర్స్‌లు

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.



**కర్నూలు, మార్చి 23:** భూసర్వే రంగంలో ఆధునిక సాంకేతికతకు నాంది పలుకుతూ కంటిన్యూయస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్ (జూ=ూ) లు కచ్చితత్వంతో పని చేస్తాయని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. సోమవారం స్థానిక రాష్ట్ర అతిథి గృహం ఆవరణ లో సర్వే ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూ=ూ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్, సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో కలిసి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ** 24 గంటలు పనిచేసే రిఫరెన్స్ స్టేషన్లు (జూ=ూ) శాటిలైట్స్ తో అనుసంధానం చేసుకొని కచ్చితమైన కొలతలు (రేఖాంశాలు, అక్షాంశాలు) కొలవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఇవి 35 కిలోమీటర్ల పరిధి వరకు పనిచేస్తాయని తెలిపారు. ఈ స్టేషన్లు సర్వేయింగ్, మ్యాపింగ్, మౌలిక సదుపాయాల కోసం రియల్–టైమ్ కైనమాటిక్ సేవలను అందిస్తాయన్నారు. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఆధునిక సాంకేతికత కలిగిన ఈ స్టేషన్ల ద్వారా సర్వే పనులు వేగంగా, తప్పులులేకుండా నిర్వహించగలమని తెలిపారు. జిల్లాలో భూసర్వే వ్యవస్థను ఆధునికీకరించే దిశగా ఇది ఒక కీలకమైన ముందడుగని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బి.సి. పరిడా మాట్లాడుతూ ఏపీలో ఈ స్టేషన్లు 70 ఉన్నాయన్నారు. జిల్లాలో ఇప్పటికే సి.బెళగల్, హోలగుంద మండలాల్లో రెండు స్టేషన్లు ఉండగా, ప్రస్తుతం అదనంగా నగరంలో ఒకటి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఈ స్టేషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ సర్వేయర్ దేవవ్రత పాలిత్, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేయర్ మురళి కృష్ణ, తదితర అధికారులు పాల్



# నాయునిపల్లెలో శ్రీ కళ్యాణరామ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం





### ఘనంగా మూడు రోజులపాటు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు

**కాశినాయన మార్చి 23 (నంది పత్రిక ):** వై.యస్.ఆర్. కడప జిల్లా కాశినాయన మండలం నాయునిపల్లె (హరిజనవాడ) గ్రామంలో శ్రీ కళ్యాణరామ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు విస్తృత ఏర్పాట్లు చేశారు. మార్చి 23 నుండి 25 వరకు మూడు రోజులపాటు ఈ మహోత్సవం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక వేడుకలతో జరగనుంది. మొదటి రోజు సోమవారం (23-03-2026) ఉదయం గంగానయనము, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, రుద్రాభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. సాయంత్రం అంకురారోహణం, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు జరుగుతాయి. రాత్రి 9 గంటలకు మున్నెల్లి పెద్ద ఓబులేసు ఆధ్వర్యంలో కులుకు భజన, కోలాటం వంటి సాంప్రదాయ కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి. రెండవ రోజు మంగళవారం (24-03-2026) పూజలు, హోమాలు, చండీ హోమం వంటి విశేష కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం మహాస్నపన, క్షీరాభిషేకం, కుంకుమార్చన నిర్వహిస్తారు. రాత్రి శ్రీ రామాంజనేయ యుద్ధ సీను మరియు భక్త చింతామణి పూర్తి నాటక ప్రదర్శన శ్రీ సాయి నాట్య కళాసమితి ఆధ్వర్యంలో జరుగనుంది. మూడవ రోజు బుధవారం (25-03-2026) ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహిస్తారు. సాయంత్రం గుండు సందెం వంటి కార్యక్రమాలు ఉంటాయి.ఈ మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించబడుతుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు. ఇట్లుడ శ్రీ కళ్యాణరామ స్వామి భక్త బృందం, నాయునిపల్లె గ్రామ ప్రజలు.

## ఉమామహేశ్వర స్వామి కి పల్లకి సేవ



**బనగానపల్లె మార్చి 23నందిపత్రిక** సోమవారం సందర్భంగా యాగంటి ఉమామహేశ్వర స్వామి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రాతః కాలమునుండే స్వామి అమ్మవార్లకు కుంకుమర్చనలు సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు.కార్యక్రమం లో ఆలయ కార్యనిర్వహ్నాధికారి పాండురంగారెడ్డి, ఆలయ చైర్మన్ మౌళిశ్వర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# పోరుమామిళ్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘన స్వాగతం అసెంబ్లీ పరిశీలకుడిగా మల్లికార్జున్ రెడ్డి బాధ్యతలు



**పోరుమామిళ్ల, మార్చి 23 (నంది పత్రిక ):**పోరుమామిళ్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బద్వేల్ నియోజకవర్గం అసెంబ్లీ పరిశీలకుడిగా దుగ్గాయపల్లె మల్లికార్జున్ రెడ్డి నియమితులై, తొలిసారిగా పోరుమామిళ్లకు విచ్చేసిన సందర్భంగా ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ, నియోజకవర్గ యువ నాయకుడు మరియు రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, రాబోయే రాజకీయ వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గోవిందరెడ్డి మార్గదర్శకత్వంలో బద్వేల్ నియోజకవర్గం 2004 సంవత్సరం నుంచి విజయపథంలో కొనసాగుతోందని, ప్రతి కార్యకర్త అంకితభావమే ఈ విజయాలకు మూలమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేస్తేనే 2029లో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడగలమని స్పష్టం చేశారు. 2004 నుంచి ఇప్పటివరకు ఓటమి ఎరుగని నియోజకవర్గంగా బద్వేల్ నిలవడానికి కార్యకర్తల నిరంతర కృషి ప్రధాన కారణమని అన్నారు. వైయస్ కుటుంబంతో ఈ ప్రాంతానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ, దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజాహిత దృక్పథంతో బ్రహ్మసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు అందించిన విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ కాలం నుంచి ప్రారంభమైన ఈ బంధం వైఎస్ఆర్సిపి స్థాపన తర్వాత మరింత బలపడిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్నప్పటికీ, వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందని, బద్వేల్ సమీపంలో సెంచరీ ఫ్యాక్టరీ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టినట్టు వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు రాజగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు సుదర్శన్, హనుమంతు రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రవిచంద్ర రెడ్డి, జడ్పిటిసిలు ముత్యాల ప్రసాద్, గురివి రెడ్డి, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు మరియు ఇతర పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక భరోసా "పీఎం విద్యాలక్ష్మి" పథకం విజయవంతం

### బద్వేల్ ఏఎంసి చైర్మన్ నారిశెట్టి సుప్రజ




**బద్వేల్, మార్చి 23 (నంది పత్రిక ):** ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్య కలలను నిజం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "పీఎం విద్యాలక్ష్మి" పథకం విశేష స్పందన పొందుతోందని బద్వేల్ ఏ ఎం సి చైర్మన్ నారిశెట్టి సుప్రజ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన ఈ పథకం విద్యార్థులకు ఆర్థికంగా బలమైన మద్దతుగా నిలుస్తోందన్నారు.ఈ పథకం ద్వారా కేవలం రెండు పేజీల సరళమైన దరఖాస్తుతోనే విద్యార్థులు సులభంగా రుణం పొందగలుగుతున్నారు. ముఖ్యంగా, కేవలం 8 రోజుల్లోనే రుణ మంజూరు పూర్తవుతుండటం విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు గొప్ప ఊరటనిస్తోంది.మొదటి ఏడాదిలోనే ఈ పథకం ద్వారా కోర్సు ఫీజుల కోసం మొత్తం ₹7,229 కోట్ల రుణాలు విడుదల చేయడం విశేషమని తెలిపారు. ఉన్నత చదువులు ఆర్థిక సమస్యల వల్ల ఆగిపోకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ భవిష్యత్తును బలపరచుకోవాలని నారిశెట్టి సుప్రజ పిలుపునిచ్చారు.

# జిల్లాలో జన గణనను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి




### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ మార్చి 23 నంది పత్రిక** భారతదేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతున్న గృహ మరియు జనగణన డేటా సేకరణ కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో 2027 గృహ, జనగణన డేటా సేకరణ కోసం నియమితులైన చార్జర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో సోమవారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ చరిత్రలో తొలిసారిగా గృహ, జనగణన ప్రక్రియను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహించడం ఒక కీలకమైన మార్పు అని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి డేటా నమోదు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సేకరించబడే ఈ డేటా ఆధారంగా ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పన, సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా చేపట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. అందువల్ల ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితమైన, నాణ్యమైన సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. మొట్టమొదటిసారిగా అన్ని శాఖల సమన్వయంతో ఈ డేటా సేకరణ జరుగుతుండటం విశేషమని పేర్కొన్నారు. ఈ గణాంకాల ద్వారా ప్రపంచపటంలో భారతదేశ స్థాయిని అంచనా వేయడానికి కూడా ఈ సమాచారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మార్చి 23 నుండి 29 వరకు ఆరు రోజులపాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ అందించే మార్గదర్శకాలను చార్జర్లు పూర్తిగా అవగాహన చేసుకుని, తమ తమ మండలాల్లో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు సమగ్రంగా వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ డా.కె.సి.హెచ్.అప్పారావు, చార్జర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

### ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 16 అర్జీలు

**కర్నూలు నంది పత్రిక....** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి రోజూ ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించాలని కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు సంబంధించి 16 ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్, సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, డిసిపి వెంకటరమణ, ఎంఈ మనోహర్ రెడ్డి, మెప్మా పిడి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



# వైద్య విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు, సాంస్కృతిక పోటీలు అవసరమే..





**డాక్టర్ పి చంద్రశేఖర్, వైస్ ఛాన్స్ లర్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ, విజయవాడ.**

**ప్రతి మెడికల్ కాలేజీకి స్పోర్ట్స్ కు పది లక్షల కేటాయిస్తాం...**

కర్నూలు నంది పత్రిక..... కర్నూలు మెడికల్ కాలేజీలో స్పోర్ట్స్ అభివృద్ధిపై వీసి సమీక్ష.. వైద్య విద్యార్థులకు వైద్య విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలు, ఆర్ట్స్ కూడా అవసరమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ పి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ అధికారిక పర్యటనలో భాగంగా కళాశాల స్పోర్ట్స్ కార్యకలాపాలపై ప్రిన్సిపల్, స్పోర్ట్స్ కమిటీ, వైద్య విద్యార్థులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో, ఆర్ట్స్ లో పాల్గొనడం అత్యంత అవసరమని తెలిపారు. ఇలా పాల్గొనడం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇతర కాలేజీల విద్యార్థులతో కలసి పోటీ పడే అవకాశం లభిస్తుందని, దాంతో వారి వ్యక్తిగత నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అలాగే శారీరక దారుఢ్యం ఉన్నప్పుడే విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలరని చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీ తన మాతృ సంస్థ అని పేర్కొన్న ఆయన, ఇక్కడి విద్యార్థులు ఇటీవల కర్నూల్ వైద్య విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో క్రీడా రంగంలో సాధించిన విజయాలను అభినందించారు. కళాశాల స్పోర్ట్స్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రతి సంవత్సరం రూ. 10 లక్షలు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. 2 లక్షల రూపాయలను నాణ్యమైన స్పోర్ట్స్ మెటీరియల్ కొనుగోలుకు అందజేస్తామన్నారు. అలాగే కళాశాలలో తలెత్తే సమస్యలను అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని, బయటి వ్యక్తుల జోక్యం వలన సమస్యలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంఇ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ మాట్లాడుతూ కేఎంసీ విద్యార్థులు వైద్య విద్యతో పాటు ఆటల పోటీల్లో కూడా ఇటీవల యూనివర్సిటీ స్థాయిలో వివిధ పోటీల్లో సెకండ్ థర్డ్ స్థాయిలో నిలిచారని కాలేజీలో స్పోర్ట్స్ సంబంధించి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని ఇప్పటికే మూడు లక్షల రూపాయల అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. వైస్ ఛాన్సర్ కేఎంసీ కి అన్ని రకాల అభివృద్ధికి సహకరిస్తున్న పట్ల వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ మరియు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే. చిట్టి నరసమ్మ, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా. త్రిమూర్తులు, ఏపీఎంఐడిసి ఇంజినీర్ వైస్ ప్రిన్సిపల్ డా. రేణుక, డా. శ్రీరాములు, డిప్యూటీ సూపరింటెండెంట్లు డా. లక్ష్మి,డా. నాగేశ్వరరావు తదితరులు, స్పోర్ట్స్ కమిటీ వైస్ చైర్మన్ డా. విద్యాసాగర్, సెక్రటరీ డా. విజయ శంకర్, డా. మహేశ్వర్ రెడ్డి, డా. శివ బాల, డా.వెంకటరమణ,డా. శివకుమార్,డా. విజయ్ బాబు, డా. జయరాం, డా. సోమశేఖర్, డాపాటు పీజీ మరియు యూజీ విద్యార్థులు పాల్గొన్నారు..

# పన్ను వసూళ్లలో ఉదాసీనత వీడాలి

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

## మొండి బకాయిదారుల ఆస్తుల జప్తు వేగవంతం



కర్నూలు నంది పత్రిక...... నగర పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లలో ఉదాసీనత వైఖరి వీడి వేగవంతం చేయాలని కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ విభాగ సిబ్బందితో పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. వసూళ్లు స్వల్పంగా ఉన్న టాప్ 50 సచివాలయాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలంటే పన్ను వసూళు కీలకమని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని తెలిపారు. మిగిలిన గడువు చాలా తక్కువగా ఉన్నందున బకాయిదారులకు మరింత సమయం ఇవ్వకుండా కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఒత్తిడులకు తలొగ్గకుండా మొండి బకాయిదారుల ఆస్తుల జప్తు ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని ఆదేశించారు. సిబ్బంది కొరత ఉన్నచోట ఇతర కార్యదర్శుల సహకారం తీసుకుని వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్‌ఐలు, అడ్మిన్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అక్రిడిటేటెడ్ మీడియా జర్నలిస్టులకు ఉచిత మెడికల్ క్యాంపుల నిర్వహణకు చర్యలు

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం బ్యూరో చీప్ మార్చి 23, నంది పత్రిక జిల్లాలోని అక్రిడిటేటెడ్ మీడియా జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం కలెక్టరేట్ కార్యాలయంలోని ఛాంబర్‌లో సోమవారం జిల్లా మీడియా ప్రతినిధులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసి, సకాలంలో గుర్తింపు కార్డులను జారీ చేసినందుకు కలెక్టర్‌ను అభినందించారు. మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లాలో అక్రిడిటేషన్ మంజూరు ప్రక్రియపై జర్నలిస్టులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ఎల్లప్పుడూ తమ వంతు సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ మంజూరు చేయబడుతోందన్నారు. 20262027 సంవత్సరాలకు గాను అక్రిడిటేషన్ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఇప్పటివరకు రెండు దఫాలుగా కమిటీ సమావేశాలు నిర్వహించి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇకపై కూడా అందుబాటులో ఉన్న దరఖాస్తులను పరిశీలిస్తూ, కమిటీ సమావేశాల ద్వారా అర్హులైన వారికి అక్రిడిటేషన్లు జారీ చేస్తామని తెలిపారు. జర్నలిస్టులు విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండడం వల్ల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితి నెలకొంటోందని, దాని ఫలితంగా కొందరు అనారోగ్యానికి గురవుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అక్రిడిటేటెడ్ మీడియా జర్నలిస్టుల కోసం ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా జర్నలిస్టుల మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిందని, త్వరలోనే మెడికల్ క్యాంపుల తేదీలను ప్రకటిస్తామని వెల్లడించారు. ప్రతి జర్నలిస్టు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ కోరారు. "మన ఆరోగ్యం మనకే కాదు, మన కుటుంబం, స్నేహితులు, సమాజంతో ముడిపడి ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనం అందరికీ ఉపయోగపడగలం" అని ఆమె సూచించారు.

# దేశ భక్తికి ప్రతిరూపం భగత్‌సింగ్ రాజ్ గురు సుఖదేవ్

## వారి ఆశయ సాధనకోసం కృషి చేయాలి విద్యార్థులు, యువకులు కృషి చెయాలి - కె రామాంజనేయులు



కర్నూలు నంది పత్రిక.... రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్ సింగ్, రాజు గురు సుఖదేవ్ ల ఆశయ సాధనకు విద్యార్థులు యువకులు కృషి చేయాలని సీసీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె రామాంజనేయులు పిలుపునిచ్చారు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ ల 95 వ వర్ధంతి సందర్భంగా సోమవారం సి ఆర్ భవన్ లో ఏఐఎస్ఎఫ్,- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నగర కార్యదర్శిలు అశోక్, బిషన్న లు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్ లు ముందుగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు చంద్ర నాయక్ లు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో నుంచి పూర్తిగా తొలగించడం కోసం కంకణం కట్టుకుందన్నారు. భగత్ సింగ్ భారత దేశ స్వాతంత్రం కోసం పోరాడడమే కాకుండా దేశంలో అసమానతలు లేని, దోపిడీ లేని సమాజం కావాలని కలలు కనే వాడని

భగత్ సింగ్ లాంటివారి చరిత్రలను ప్రచారం చేయడానికి పాలక ప్రభుత్వాలు జంకుతున్నట్లు చెప్పారు. భగత్ సింగ్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువకులు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. ప్రపంచంలో అమెరికా- ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ మీద పెద్దఎత్తున యుద్ధం చేస్తూ మారణ హోమం సృష్టిస్తున్నాయని అన్నారు. యుద్ధం విషయంలో మన దేశ ప్రధానమంత్రి మోడీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయస్సులోనే భగత్ సింగ్ తన ప్రాణాలను తృణప్రాయంగా విడిచిపెట్టారని అన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ భగత్ సింగ్ ఇచ్చిన నినాదం ఇప్పటికీ వేల గొంతుల స్వరంగా మారు మోగుతోందని వివరించారు. ప్రజా భద్రత చట్టం, పారిశ్రామిక వ్యవహారాల చట్టాలు రెండూ ఆనాడు ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి వచ్చాయని, వాటికి నిరసనగా భగత్ సింగ్ పార్లమెంటులో ప్రజల ప్రాణాలకు హాని కలగని ఒక బాంబులు విస్తరి వారి పోవడానికి అవకాశం ఉన్నప్పటికీ కావాలనే పట్టుబడి కోర్టుల ద్వారా స్వాతంత్ర వాళ్లను యువతలో రగిలించడానికి కోర్టులను ఉపయోగించుకున్నారు అన్నారు దేశ భక్తికి అసలు ప్రతిరూపం భగత్‌సింగ్ అని నేటి తరం యువత భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటు పాడాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగరాజు, నగర నాయకులు అఖిల్, కళాఖర్, రసూల్, ఫైరోజ్, కుమారు, ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు మధు,లోకేష్, వంశీ, సిపిఐ కర్నూల్ నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు శ్రీనివాసరావు, సుంకన్న, ప్రసాదు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# శెట్టి బలిజ జాతిపిత, అట్టడుగు వర్గాల విద్య సామాజిక అభ్యున్నతికి కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం బ్యూరో చీప్ మార్చి 23 నంది పత్రిక శెట్టిబలిజ జాతిపిత సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి 173 వ జయంతి ఉత్సవమునకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ శెట్టి బలిజ సమాజానికి విద్య ఐక్యత గౌరవం తీసుకొచ్చిన గొప్ప నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డి అన్నారు. 19 వ శతాబ్దంలో అట్టడుగు వర్గాలకు విద్యా సామాజిక అభ్యున్నతికి ఆయన చేసిన కృషి యువత భవిష్యత్తు తరాలకు మంచి ప్రేరణ కలిగిస్తాయని అన్నారు. సామాజిక ఐక్యత విద్య కోసం ఆయన చేసిన కృషి సరస్మరణీయం అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లవలసిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. సమాజ అభివృద్ధికి చేసిన సేవలు మరువరానివని ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త శెట్టి బలిజ సంఘ వ్యవస్థాపకులు జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగా జరుపుకోవడం బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం అద్దం పడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ఈ సందర్భంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఏ.వి సూరిబాబు, వసతి గృహాల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



# పిజిఆర్ యస్ లో అందిన దరఖాస్తులోని అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



**దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలి**

**ధరఖాస్తులు పరిష్కారంలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు**

**సోమవారం పిజిఆర్ యస్ లో అందిన అర్జీలు 358**

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...**

ఏలూరు, బ్యూరో చీప్ మార్చి , 23 నంది పత్రిక జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయీ అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి భాస్కర్, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, సర్వే శాఖ ఏడి అన్సారీ, తదితరులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ యస్ లో అందిన ప్రతి అర్జీ ని పరిశీలించి, వాటిలో తెలియజేసిన విషయాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి, నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. పిజిఆర్ యస్ లో అందిన ప్రతి అర్జీ రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ యస్ లో అందిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని , కావున అధికారులు క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చేసి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. భూ సమస్యలు రెవిన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.

**సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలు 358** పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులో కొన్ని.

కామవరపుకోట మండలం జలపావారిగూడెం నకు చెందిన బాడిపట్ల సుబ్బమ్మ తన దరఖాస్తులో నా కుమారుడుకి నా భూమి ని ఇచ్చానని, తన భూమిని తీసుకుని తన పోషణ చూడడంలేదని, కొడుకు, కోడలు తనపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయింది. తనకు న్యాయం చేయాలనీ కోరగా,వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లి గ్రామానికి చెందిన కాజా సత్తమ్మ తనకు వృద్ధ్యాప్యపు పెన్షన్ మంజూరు చెయ్యబలసిందిగా కోరారు. ఏలూరు మండలం కొమదవోలు కు చెందిన షేక్ జుబేదాబేగం తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరారు. కొయ్యలగూడెం మండలం పరింపూడి కి చెందిన కానూరి సత్యనారాయణ తన దరఖాస్తులో తమ గ్రామంలో ప్రధాన రహదారికి వెళ్లే నాలుగు కూడలిలో అనధికారికంగా కట్టిన కల్వర్టు కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, సమస్య పరిష్కరించాల్సిందిగా కోరారు. ఏలూరు కు చెందిన భూపతి వాసంతి తమకు ఇంటి స్థలం మంజూరు చేయవలసిందిగా కోరారు. ఏలూరు తంగెళ్లమూడి కి చెందిన అలజింగి నాగరాజు తమ ప్రాంతంలో దుర్గకిషోర్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని, తొలగించాలని కోరారు. లింగపాలెం మండలం తవ్వచిలకరాయుడుపాలెం గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ గ్రామంలో నిర్మిస్తున్న డ్రైన్లు నాణ్యత ప్రమాణాలు లేకుండా నాసిరకం మెటీరియల్ తో నిర్మిస్తున్నారని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ద్వారకా తిరుమల మండలం దొరసానిపాడు గ్రామానికి చెందిన లక్కబట్టులా మరియమ్మ తన దరఖాస్తులో తన ఇంటిని తన కొడుకుపేరుమీదుగా రాసానని కానీ తన కొడుకు, కోడలు తమ ఇంటిని తీసుకుని తనను ఇంటినుండి తరిమివేశారని తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. సదరు దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపి నిర్ణీత సమయంలోగా పరిష్కరించి, పరిష్కార విధానాన్ని సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, రెవిన్యూ అధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు



# నిరుపేద ప్రజలకు వైద్య సేవలు





## మీ ఇంటికి మీ డాక్టర్ మొబైల్ మెడికల్ యూనిట్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ మార్చి 23, నంది పత్రిక** గ్రామీణ మరియు తీరప్రాంతాల్లో నివసించే నిరుపేద ప్రజలకు వైద్య సేవలను వారి ముంగిటకే అందించాలనే లక్ష్యంతో "మీ ఇంటికి మీ డాక్టర్" మొబైల్ మెడికల్ యూనిట్‌ను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మొబైల్ మెడికల్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించి, అనంతరం వాహనంలో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పశ్చిమ గోదావరి జిల్లాలోని గ్రామీణ నిరుపేదలకు, ముఖ్యంగా తీరప్రాంతాల్లో నివసించే మత్స్యకార కుటుంబాలు, గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఆసుపత్రులకు రాలేని ప్రజలకు ఈ మొబైల్ మెడికల్ యూనిట్ ఎంతో ఉపయుక్తంగా మారుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ సహకారంతో మరియు ఆర్.ఇ.సి ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులతో అమలు చేస్తున్నారని తెలిపారు. సుమారు రూ.1.30 కోట్ల వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్ట్‌ను జిల్లాలో మూడు సంవత్సరాలపాటు కొనసాగించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ఏడు జిల్లాల్లో ఆర్.ఇ.సి ఫౌండేషన్ సుమారు రూ.8.40 కోట్లతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు. ఈ మొబైల్ యూనిట్ ద్వారా ఒక డాక్టర్, నర్సు, ఫార్మసిస్ట్ మరియు డ్రైవర్‌తో కూడిన ప్రత్యేక బృందం గ్రామాలకు వెళ్లి ఉచిత వైద్య సేవలు అందించడమే కాకుండా అవసరమైన మందులను అక్కడికక్కడే పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా శిశు మరణాల రేటు, మాతృ మరణాల రేటు తగ్గించడం, అంటువ్యాధుల నియంత్రణ ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యాలుగా నిర్ణయించబడినట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా, త్వరలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో "ప్రోస్థటిక్ హ్యాండ్" ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించి, అర్హులైన వికలాంగులకు కృత్రిమ చేతులను అమర్చేందుకు నమోదు చేపడతామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఆరోగ్య సేవలు నిరంతరం మెరుగుపడేందుకు రెడ్ క్రాస్ ప్రతినిధులు మరియు వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డా.ఎం.ఎస్.వి.ఎస్.భద్రిరాజు మాట్లాడుతూ, ఈ మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా ప్రతి గ్రామానికి వైద్య సేవలను చేరవేయడం తమ లక్ష్యమని తెలిపారు. త్వరలో జిల్లాలో కార్నియా కలెక్షన్ సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా మొబైల్ మెడికల్ వాహనంలో వైద్య పరీక్షలు చేయించుకుని, అందులోని సేవల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జి.గీతాబాయి, డి.సి.హెచ్.ఎస్ పి.సూర్యనారాయణ, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ బొబ్బిలి శెట్టి కనకరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 30 వ తేదీ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయండి

## జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్




**కర్నూలు, నంది పత్రిక.....**హౌసింగ్ కి సంబంధించి వచ్చే సోమవారం మధ్యాహ్నం 12:20 గంటలకు సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించబడుతుందని అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హౌసింగ్ , రెవిన్యూ క్లినిక్స్, ఎల్పీజి తదితర అంశాల పై మండల అధికారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 30 వ తేదీ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జరగాలన్నారు. అదే విధంగా ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను వెంటనే అందజేయాలన్నారు. ఆప్షన్3 కింద కాంట్రాక్టర్ లు నిర్మించిన ఇళ్లలో 2 వేల 522 ఇళ్లలో నిర్మాణ లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 1485 ఇళ్ల నిర్మాణాల లోపాలను సరిచేయడం జరిగిందని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా అలాగే నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చిన అర్జీలలో పెండింగ్ లో ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న రీ ఓపెన్ అర్జీలను త్వరితతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఒక అర్జీ కూడా బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ ఓ ఆర్ కేసులు ఎక్కడైనా రీ ఓపెన్ అయితే సంబంధిత పిటిషనర్ నుండి ఆర్ ఓ ఆర్ అప్పీల్ తీసుకొని డిస్పోస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే ఫేస్ 2, 3 విభాగాలలో జరుగుతున్న సర్వే పనులకు సంబంధించిన ప్రపోజల్స్ 2 రోజుల్లో ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్డీఓ లను ఆదేశించారు. 22 ఏ కేసులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు. ఎల్.పి.జి కి సంబంధించి గత 10 రోజులుగా ఎల్.పి.జి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, డిమాండ్ పెరుగుతూనే ఉందన్నారు. జిల్లాలోని మొత్తం 42 గ్యాస్ ఏజెన్సీలను ప్రతిరోజూ నోడల్ అధికారులు సందర్శించాలన్నారు. ఎల్.పి.జి ఏజెన్సీలు లేదా డీలర్లు బ్లాక్ మార్కెటింగ్ లేదా అక్రమ లాభార్జన చేయకుండా నిఘా పెట్టడం జరిగిందన్నారు. ప్రతి నెల మొదటి 10 రోజులలో ఎఫ్పి షాప్ లను ఆకస్మిక తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు. పెండింగ్ లో రేషన్ కార్డు ఈకేవైసి ప్రక్రియ పూర్తి కావాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో డి ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, డి ఎస్ ఓ రఘువీర్, సివిల్ సప్లైస్ డి ఎం వెంకట రాముడు, ఎస్డిసి నాగ ప్రసన్న, తహసిల్దార్ శ్రీనాథ్, ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మోటార్ బైక్ ను ఢీ కొన్న కారు

## ఇద్దరు కానిస్టేబుల్లకు గాయాలు







**కోయిలకుంట్ల మార్చి 23నందిపత్రిక** కోవెలకుంట్ల జమ్మలమడుగు ప్రధాన రహదారి పై సోమవారం గుళ్ళదుర్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోవెలకుంట్ల పోలిసుస్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుల్స్ గాయపడ్డారు. సోమవారం ఉదయం విధుల నిమిత్తం గుళ్ళదుర్తికి మోటార్ బైక్ పై వెళ్తున్న రాంబాబు, మహేశ్వర్ రెడ్డి అనే కానిస్టేబుల్ల మోటార్ బైక్ ను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో బైక్ పై వెళ్తున్న వీరు గాయపడ్డారు.స్థానికులు పోలీసులు గాయపడిన వారిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివరామిరెడ్డి నామినేషన్ దాఖలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 23, నంది పత్రిక** ఆళ్లగడ్డ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ప్రముఖ సీనియర్ న్యాయవాది, ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి రెండోసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. స్పోర్ట్స్ కార్యదర్శిగా టి.వినోద్ కుమార్ నామినేషన్ వేశారని ఎలక్షన్ ఆఫీసర్ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమ మంగళవారం నామినేషన్ పర్వం ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నీలకంఠం, శ్రీనాథ రెడ్డి, గోపాల్ రెడ్డి, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ స్ఫూర్తితో డ్రగ్స్ పై పోరాటం

**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 23 నంది పత్రిక** భారతి విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఎద్దుల పాపమా హైస్కూల్ లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల చిత్రపటాలకి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల్ కార్యదర్శి లతీఫ్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి ఉరికంబుమెక్కిన యువకిశోరం భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ ల వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేస్తూ డ్రగ్స్ పై విస్తృతమైన పోరాటం చేయాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని విద్యార్థులు యువజనలు అభ్యుదయ శక్తులు పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ కేంద్రంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కార్పొరేట్ కాలేజీల్లో స్కూల్స్ ఉన్న సమస్యలపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తామని తెలిపారు .శాస్త్రీయ విద్య కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ చదువు పూర్తి అయిన అందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. చదువుతూ పోరాడు- చదువుకై పోరాడు అనే నినాదంతో పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ ని బలోపేతం చేయడానికి విద్యార్థులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మనువాదాన్ని తీసుకొస్తూ భవిష్యత్తు విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నదని దానికి వ్యతిరేకంగా విద్యార్థుల ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఫీజులు అత్యధికంగా తల్లిదండ్రులు దగ్గర్నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యా అధికారులు ఏమాత్రం పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భాష, బషీర్,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రేరణ సఖి పుస్తకావిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ మార్చి 23 నంది పత్రిక** జిల్లాలో మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనకు ప్రతీకగా నిలిచే "ప్రేరణ సఖి -100 (2024-25)" పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రూపొందించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు మరియు స్వయం సహాయక సమూహాలు మహిళల ఆర్థిక స్వలంబన సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా సాధించిన విజయాలు, ఉత్తమ పద్ధతులు, అభివృద్ధి దిశగా సాధించిన పురోగతిని "ప్రేరణ సఖి-100" పుస్తకం సమగ్రంగా ప్రతిబింబించడం అభినందనీయమని తెలిపారు. ఈ పుస్తకం ఇతర మహిళలకు మార్గదర్శకంగా, ప్రేరణగా నిలుస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. మెప్మా ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలనలో మహిళల భాగస్వామ్యం మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే మెప్మా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మెప్మా పిడి హెప్సిబా, మెప్మా అధికారి నాని బాబు, తదితరులుపాల్గొన్నారు.

# మార్చి 26న పాలకొల్లులో నిర్వహించే మెగా ప్లేస్మెంట్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీప్ మార్చి 23 నంది పత్రిక** పాలకొల్లులోని బి ఆర్ ఆర్ అండ్ జీ కే ఆర్ ఛాంబర్ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించనున్న మెగా ప్లేస్మెంట్ డ్రైవ్‌ను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పశ్చిమ గోదావరి జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన పాలకొల్లులోని బి ఆర్ ఆర్ & జీ కే ఆర్ ఛాంబర్ డిగ్రీ కాలేజ్‌లో మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించబడుతున్నట్లు తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో సుమారు 17 ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని, అదనంగా మరికొన్ని సంస్థలు కూడా పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం మీద 1,500 లకు పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత కంపెనీల నిబంధనల ప్రకారం ఎంపిక చేయబడతారని చెప్పారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా ఆన్లైన్‌లో నమోదు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. నమోదు కోసం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి రిజిస్ట్రేషన్ పోర్టల్ ఇతర వివరాల కోసం 9618560188 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా. పి. లోకమాన్, ఆంజనేయులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# "మహిళ ఆర్థికంగా బలపడితే దేశం ఆర్థికంగా ప్రగతి సాధిస్తుంది" జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీప్ మార్చి 23 నంది పత్రిక** మహిళల ఆర్థిక సాధికారత ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. సోమవారం భీమవరం పట్టణంలో స్వయం సహాయక సంఘాల (ఎస్.హెచ్.జి) మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు వ్యాపార సంస్థలను ఆమె ఘనంగా ప్రారంభించారు. భీమవరం ఆర్టీసీ డిపో సమీపంలో సీతారామ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "శ్రీ పికిల్స్ అండ్ పిండి వంటలు" దుకాణాన్ని, అలాగే ఫ్లైఓవర్ సమీపంలో లక్ష్మీ తులసి స్వయం సహాయక సంఘం నిర్వహిస్తున్న "సౌభాగ్య ఆర్గానిక్ అండ్ న్యాచురల్ ఆయిల్స్" దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివరాలు పరిశీలించిన కలెక్టర్, ఉత్పత్తుల నాణ్యత, తయారీ విధానాలు, మార్కెటింగ్ విధానాలపై మహిళలతో మాట్లాడి వారి కార్యకలాపాలను అభినందించారు శ్రీ పికిల్స్ అండ్ పిండి వంటలు షాపును డిఆర్డిఏ సహకారంతో సీతారామ గ్రూపు రూ.3 లక్షల స్త్రీనిధి రుణంతో ఏర్పాటు చేసింది.సౌభాగ్య ఆర్గానిక్ అండ్ న్యాచురల్ ఆయిల్స్ సంస్థను డిఆర్డిఏ సహకారంతో లక్ష్మీ తులసి సంఘం రూ.13 లక్షల పెట్టుబడితో (రూ.10 లక్షలు పీఎం ఎఫ్ఎంఈ రుణం, రూ.2 లక్షలు బ్యాంకు రుణం, రూ.1 లక్ష స్త్రీనిధి) స్థాపించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తే వ్యాపారంపై నమ్మకం పెరిగి అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు వివిధ రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగి, మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రోత్సహించారు. వ్యాపారంలో వచ్చిన లాభాలను తిరిగి వ్యాపార అభివృద్ధికి వినియోగించడం ద్వారా విస్తరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎస్.ఎస్ వేణుగోపాల్, ఏపీడీలు కుసుమ కుమారి, శ్రీనివాసరావు, స్వయం సహాయక సంఘాల మహిళలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు..



# భగత్ సింగ్ ఆశయ సాధన కోసం పోరాడుదాం







**మతోన్మాద వ్యతిరేక పోరాటమే**
**భగత్ సింగ్ కు నిజమైన నివాళి**
**రాయలసీమ విశ్వవిద్యాలయంలో**
**భగత్ సింగ్ 95 వ వర్ధంతి**
**పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్**

**కర్నూలు నంది పత్రిక...** మతోన్మాద వ్యతిరేక పోరాటమే భగత్ సింగ్ కు నిజమైన నివాళి అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు కె. భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు రమణ కుమార్ అన్నారు.స్థానిక రాయలసీమ విశ్వవిద్యాలయంలో కామ్రేడ్ భగత్ సింగ్, రాజు గురు, సుకుదేవుల 95వ వర్ధంతి సభ నిర్వహించడం జరిగింది. ముందుగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశంలో సామ్యవాదం, సార్వభౌమాధికారం, లౌకికవాదం, సోషలిజం, సమసమాజాన్ని స్వప్నించిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు అమరులై నేటికీ 95 ఏండ్లు గడుస్తుందని అన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి యుక్త వయస్సులోనే ఉరికంబాన్ని ముద్దాడిన యోధులని అన్నారు. బ్రిటిష్ పార్లమెంట్ పై పొగ బాంబులు విసిరి వెన్నులో వణుకు పుట్టించారని అన్నారు. భగత్ సింగ్ సాహసం, తెగువ, త్యాగనిరతి,దేశభక్తి నేటి యువతకు స్ఫూర్తి దాయకం అని అన్నారు. నాడు అనేకమంది యువకులు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేస్తే నేటి యువత డ్రగ్స్, గంజాయి, మాదక ద్రావ్యాల మత్తులో మునుగుతూ ప్రశ్నించడం మరిచి పోయారని అన్నారు. పాలకుల పాదాసేవలో పడి కులం, మతం అంటూ విద్వేషాలు రెచ్చగొట్టే వారివెంటే ఉంటున్నారని అన్నారు. చమురు సంపద దురాక్రమణ కోసం ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ నిరపరాధ ప్రజలపై జరుగుతున్న దాడులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే భారత్ ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్నాయని విమర్శిస్తూ ఆ ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ ఖ+జ 2026 కుల వివక్షతకు ముసాయిదా తయారు చేసిందని దానిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముసాయిదా అమలు కాకుండా సుప్రీంకోర్టు స్టే ను రద్దు చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల అభివృద్ధి కొరకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 4200 ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 10 వేల 60 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని అది జాబ్ కాలండర్ కాదు దగా చేసే క్యాలెండర్ అని అన్నారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖలో ఖాళీగా ఉన్న లక్ష 35 పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నేటి యువత భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకుని మతోన్మాద, సామ్రాజవాద వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు సుధాకర్, సాయి, పవన్, తిరుమలేష్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ మహిళా శిల్పి భువనేశ్వరికి శివంగి అవార్డు



**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి23, నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్రాచారి కుమార్తె మహిళా శిల్పి భువనేశ్వరికి అరుదైన అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో 2026 సంవత్సరానికి గాను మహిళా శిల్పిగా భువనేశ్వరికి శివంగి అవార్డ్ వరించింది. ఆమెకు ప్రముఖుల చేతుల మీదుగా శివంగి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముకులు మాట్లాడుతూ భువనేశ్వరి ప్రతిభను ప్రశంసిస్తూ కళారంగానికి ఆమె చేస్తున్న సేవలను కొనియాడారు. భువనేశ్వరికి ఈ అవార్డు లభించడం పట్ల స్థానిక శిల్పకళా అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## జన గణనపై శిక్షణా కార్యక్రమం



**జూపాడుబంగ్లా: మార్చి: 23 :(నంది పత్రిక )** మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లకు, గ్రామ సహాయకులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొదటి విడత జనగణన మే 1 నుండి 30 తేదీ వరకు జన గణన, కుటుంబాల లెక్కింపు ఉంటుందని తెలిపారు. గ్రామాల వారిగా హౌస్ లిస్టింగ్ బ్లాక్ సరిహద్దులు రఫ్ గా తయారుచేసి 24న తాసిల్దార్ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. ఏఎస్ఓ ఎస్. హనుమంతు మరియు సర్వేర్ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి టి. ఎన్. నాగన్న,సర్వేరులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు పాటించాలి...!

**జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎం. గంగాధర్**
**రోజురోజుకూ ఎండ తీవ్రవత పెరిగిపోతుంది. ఎండ తీవ్రవతను లెక్కచేయకుండా తిరగటం వలన త్వరగా అలసటకు గురికోవడం సంభవిస్తుంది. ఈ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా 'వడదెబ్బ'కు గురి అయ్యే అవకాశం ఉంది. దీని వలన ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో డాక్టర్ఎం. గంగాధర్ మాటల్లో...**

**జూపాడుబంగ్లా: మార్చి: 23: ( నంది పత్రిక)** ప్రశ్న: వడదెబ్బ అంటే ఏమిటి.. దీనికి గురైయ్యే ప్రమాదం ఎవరికి ఎక్కువగా ఉంటుంది. డాక్టర్ : శరీరంలో వేడిని నియంత్రించే విధానము విఫలమైన సమయంలో తీవ్రమైన అలసట, నిరసానికి గురి కావడంతోపాటు ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుంది. దీనినే వైద్య భాషలో వడదెబ్బ అంటారు. పిల్లలు, వృద్దులు(65 సంవత్సరాలు పైబడిన వారు), శారీరిక శ్రమ చేసేవారు, ఎక్కువ సమయంలో ఎండలో తిరిగేవారు. పనిచేసేవారు గురైయ్యే ప్రమాదం ఉంది. అంతేకాకుండా గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతుండే వారు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడేవారు త్వరగా ఈ వడ దెబ్బకు గురౌ తారు. ప్రశ్న: వడదెబ్బ లక్షణాలు ఎలా ఉంటాయి..ఈ సమయంలో శరీరంలో ఎటువంటి మార్పులుజరుగుతాయి.. ఆ సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి...? డాక్టర్: శరీర కండరాలు తిమ్మిరెక్కినట్లు ఉన్న.. భారీగా చెమట పోసినా.. విపరీతమైన అలసట అనిపించినా..తలనొప్పి,వాంతులు,గుండె ఎక్కువగా కొట్టుకోవడం , చర్మం పాలిపోవడం, ముదురు రంగులో మూత్రం రావడం ప్రధానమైన లక్షణాలుగా చెప్పవచ్చు. సాధారణ శరీర ఉష్ణోగ్రత కంటే అధిక ఉష్ణోగ్రతకు గురి కావడం వల్ల అలసటకు దారితీస్తుంది.ఈ సమయంలో శరీరం వేడిని నియంత్రించే సామర్థ్యం తగ్గిపోతుంది. శరీర ఉష్ణోగ్రత 41 సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ చేరుకుంటే సమస్య తీవ్రమైనట్లుగా భావించవచ్చు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే చల్లటి ప్రాంతానికి చేరుకోవాలి. వీలైతే చల్లని షవర్ కిందకు చేర్చాలి. అందుబాటులో లేకపోతే చల్లని నీటిలో ఉంచిన స్పాంజ్ తో, ఐస్ ప్యాక్ తో నుదురు మెడ శరీరాన్ని తుడవాలి.

ప్రశ్న: ఈ సమస్య నుంచి తప్పించుకునేందుకు చిట్కాలు ఏమైనా ఉన్నాయా..? డాక్టర్ : వడదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు ఈ వేసవిలో కొన్ని చిట్కాలు ఆచరణ చేస్తే ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకోవచ్చు . లూజు, లూజుగా ఉండే దుస్తులు ధరించాలి. లేత రంగు దుస్తులు ధరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆల్కహాల్ సేవించకుండా ఉండటం మంచిది. ఆల్కహాల్ సేవించడం వల్ల డి హైడ్రోజన్ కు గురికావాల్సి వస్తుంది. చల్లటి నీరును ఎక్కువగా తీసుకోవాలి. దోసకాయ, పుచ్చకాయ, దానిమ్మ, అరటి వంటి పండ్లను తినడం ఎంతో శ్రేయస్కారము. ఏరోబిక్ వ్యాయామాలకు దూరముగా ఉండాలి. వీలైనంత తేలికపాటి వ్యాయామం చేయడంతో పాటు ఈత కొట్టడం మంచిది.పూర్తిగా శరీరాన్ని కప్పి ఉండేలా దుస్తులు ధరించకుండా వదులుగా ఉన్న దుస్తులను ధరించాలి. బయట తిరిగేవారు టోపీ సన్ గ్లాసులు వాడడం మంచిది. ఒకవేళ మీకు వడదెబ్బ వచ్చే ప్రమాదము ఎక్కువగా ఉన్నట్లయితే అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోండి మరియు దగ్గరలో తక్షణ వైద్య సేవలు పొందండి.



## దేశ విముక్తికోసం ఉరికంభం ఎక్కిన అమరవీరులకు ఘన నివాళి



**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 23, నంది పత్రిక** భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారి పాలననుండి భారత దేశ విముక్తి కోసం ఉరికంబం ఎక్కిన అమరవీరులు భగత్ సింగ్, రాజ్ గురు, షాహిద్ సుఖుదేవ్ లకు సోమవారం స్థానిక ప్రజ్ఞ హైస్కూల్లో ప్రజ్ఞ విద్యాసంస్థల డైరెక్టర్ హేమలత రెడ్డి ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి.అమీర్ బాషా ముఖ్యఅతిథిగా హాజరై స్వాతంత్ర్య సమరయోధులైన భగత్ సింగ్, రాజ్ గురు, షహీద్ సుఖదేవ్ ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారి పరిపాలన నుండి దేశ విముక్తి కోసం బ్రిటిష్ వారి ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్ రాజ్ గురు, షాహిద్ సుఖుదేవ్ ల ఆశయ సాధనకు కృషిచేయాలనీ ఆయన తెలిపారు.

# భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవల ఆశయాలను కొనసాగిస్తాం.

**భగత్ సింగ్ జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలి.**
**భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలి.**
**భగత్ సింగ్ కు భారతరత్న**
**భగత్ సింగ్ జయంతి వర్ధంతిలను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి.**
**భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా నివాళు లర్పించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు**
**ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్**

**కర్నూలు నంది పత్రిక.....**ధైర్యానికి ప్రతీక, దేశభక్తికి ప్రతిరూపం, వీరత్వానికి మారుపేరు, నవతరానికి స్ఫూర్తి, భయమెరుగని భారతీయుడు, మహనీయ స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన త్యాగం, ఆలోచనా దృక్పథం, దేశానికి అంకితభావం ఎన్నటికీ మరువలేనివని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ కొనియాడారు. సోమవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీ ఒక ద్వారం నందు కాగడాల ప్రదర్శన నిర్వహించి, భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే బ్రిటిష్ పాలనపై పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేశారని, ఆయన త్యాగం అజరామరమని అన్నారు. భగత్ సింగ్ సేవలకు తగిన గౌరవం ఇప్పటికీ పూర్తిగా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన ఈ మహనీయునికి భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం అయిన భారతరత్నను ప్రకటించడం ద్వారా ఆయన త్యాగాన్ని గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది కేవలం ఒక వ్యక్తికి గౌరవం ఇవ్వడం మాత్రమే కాదు, దేశభక్తి విలువలను మరింతగా బలపరచడం కూడా అవుతుందని ఆయన పేర్కొన్నారు. భగత్ సింగ్ జయంతి మరియు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన కోరారు. ప్రతి సంవత్సరం ఈ మహానుభావుని జ్ఞాపకార్థం ప్రభుత్వ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో దేశభక్తి, త్యాగస్ఫూర్తి పెంపొందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు భగత్ సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజానికి సేవ చేయాలనే స్ఫూర్తి పొందుతారని తెలిపారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థులు కేవలం పాఠ్యాంశాల పరిమితిలోనే కాకుండా, దేశ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటం గురించి లోతుగా అవగాహన కలిగి ఉండాలి. భగత్ సింగ్ వంటి మహనీయుల జీవితం విద్యార్థులకు నైతిక విలువలు, ధైర్యం, సమాజ సేవ పట్ల నిబద్ధతను నేర్పుతుంది. అందువల్ల పాఠశాలలు, కళాశాలల సిలబస్‌లో ఆయన జీవిత చరిత్రను చేర్చడం అత్యవసరమని పేర్కొన్నారు.భగత్ సింగ్ వంటి మహనీయుల త్యాగాలను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా మాత్రమే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు ఆలీ,రాజు, హరీష్ రాఘవ్, సంతోష్, ఈశ్వర్,తదితరులు పాల్గొన్నారు.

## పక్కా ప్లాన్ తో భార్యను చంపేసిన డాక్టర్

మధ్యప్రదేశ్‌లో దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. అక్రమ సంబంధం బయటపడటంతో కట్టుకున్న భార్యనే ఓ డాక్టర్ అత్యంత కిరాతకంగా హతమార్చాడు. అనంతరం ఆ హత్యను ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించి అడ్డంగా దొరికిపోయాడు. సాగర్ జిల్లాకు చెందిన డాక్టర్ నీలేష్ కుర్మి తన భార్య సీమా కుర్మి(38)ని చంపి, కారులో ఆమె మృతదేహంతో పాటు దహనం చేశాడు. ఈ కేసులో డాక్టర్‌తో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళ్తే.. మార్చి 21వ తేదీ తెల్లవారుజామున 4 గంటల సమయంలో సాగర్-గర్హాకోట రహదారిపై ఓ కారు పూర్తిగా దగ్ధమై అందులో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విచారణ చేపట్టిన పోలీసులకు ఇది ప్రమాదం కాదని, పక్కా ప్రణాళికతో చేసిన హత్య అని తేలింది. సాగర్ ఏఎస్పీ లోకేష్ సింగ్ కథనం ప్రకారం.. నీలేష్‌కు తన క్లినిక్‌కు వచ్చే ఓ యువతితో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం భార్య సీమాకు తెలియడంతో ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలోనే భార్యను అడ్డు తొలగించుకోవాలని నీలేష్ నిర్ణయించుకున్నాడు. ఘటన జరిగిన రోజు రాత్రి భార్యతో గొడవపడి ఆమెను గొంతు నులిమి చంపాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక, హత్యను కప్పిపుచ్చుకునేందుకు పథకం వేశాడు. వైద్యుడు కావడంతో, మృతదేహాన్ని ఆసుపత్రికి తీసుకెళ్తే గొంతుపై ఉన్న గుర్తుల వల్ల హత్య విషయం బయటపడుతుందని భావించాడు. దీంతో తన ఇంట్లో అద్దెకుంటున్న రామ్‌కృష్ణ పటేల్, శుభం పటేల్‌లను పిలిచి, తన భార్యకు గుండెపోటు వచ్చిందని నమ్మించి వారి సహాయంతో ఆమె మృతదేహాన్ని కారులో ఎక్కించాడు. అనంతరం కారును నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, పెట్రోల్ పోసి నిప్పంటించాడు.

# కలెక్టరేట్ ల ముందు టిపిటిఎఫ్ నిర్వహించే నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.

### తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ పిలుపు.



**కేసముద్రం, మార్చి 23(నంది పత్రిక):**రాష్ట్ర టిపిటిఎఫ్ పిలుపు మేరకు మార్చి 24న అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు నిర్వహించబోయే నిరసన కార్యక్రమంలో కథన రంగాన్ని తలపించేలా, ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ మార్చి 24న నిర్వహించబోయే నిరసన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషన్ స్పష్టంగా విద్యాశాఖకు కనీసం 18 శాతం నిధులు కేటాయించాలని సూచించినప్పటికీ, ప్రభుత్వం ఆ సూచనలను పూర్తిగా పెడ చెవిన పెట్టి, కేవలం 8.24 శాతం మాత్రమే బడ్జెట్ కేటాయించడం విద్యా రంగంపై నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా జులై 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను, పీఆర్సీని అమలు చేయాలని, మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయాల ఉపాధ్యాయులకు ఆరోగ్య పథకం వర్తింపచేయాలనీ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు కూడా సమయం వచ్చినప్పుడు తమ సత్తా చాటాలని, సంఘం ఇచ్చిన పిలుపుకు తక్షణమే స్పందించి అందరూ విధిగా నిరసన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని, తద్వారా ప్రభుత్వానికి ఉపాధ్యాయుల సంఘటిత బలాన్ని చూపించి సమస్యల పరిష్కారాన్ని కోరాలన్నారు. మన ఐక్యతే మన బలమని మనం బలంగా ఉంటేనే ప్రభుత్వాలు మన సమస్యలు పరిష్కరిస్తాయనే విషయాన్ని ఎప్పుడూ మరవరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసం నర్సయ్య, అప్పాల నాగరాజు, వెలమాల భాస్కర్ లు పాల్గొన్నారు.

# సిసి కెమెరాల సహాయంతో గంటల వ్యవధిలో పోగొట్టుకున్న బ్యాగును కనిపెట్టి బాధితులకు అందజేసిన వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి

### -వన్ టౌన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాధితులు




**నంద్యాల ప్రతినిధి. మార్చి 23 . (నంది పత్రిక ):** ఆదివారం సాయంత్రము షేక్ శాలినా మరియు ఆమె భర్త పిల్లలు కలిసి బైక్ మీద చాబోలు నుండి నంద్యాల 1 టౌన్ పరిధి లో ని నడిగడ్డ లోని ఆమె చెల్లెలు ఇంటికి బట్టలు మరియు 12 తులాల బంగారాన్ని బ్యాగ్ లో పెట్టుకుని వస్తుండగా 1 టౌన్ పరిధిలోకి వచ్చేసరికి బంగారు ఉన్న బ్యాగ్ పడిపోయింది.సదరు విషయాన్ని గమనించిన ఫిర్యాదిదారులు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశారు.సదరు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసిన అనంతరం ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తన సిబ్బంది సహాయంతో నంద్యాల టౌన్ పరిధిలో బాధితులు వెళ్లిన ప్రదేశంలోని వివిధ సిసి కెమెరాలను మరియు పట్టణ కేంద్రంలో ఉన్న కమాండ్ కంట్రోల్ లో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించి సదరు బాగ్ నడిగడ్డకి చెందిన ఆటో డ్రైవర్ అయిన ఎస్కే నూరుల్లా భాషా కి దొరికిన సమాచారము తెలుసుకుని అతన్ని పిలిపించి విచారించగా పోయిన బ్యాగ్ ని తీసుకుని ఇవ్వడం జరిగింది. సదరు బ్యాగ్ ని ఫిర్యాదు సమక్షములో పరిశీలించగా అందులో బంగారు నగలు అన్నీ ఉన్నాయని గుర్తించారు. 12 తులాల నగలను బట్టలను ఫిర్యాదుదారులుకు అప్పగించడమయినది.కేవలం గంటల వ్యవధిలో ఇన్స్పెక్టర్ తన సిబ్బందిని అప్రమత్తం చేసి పోగొట్టుకున్న బ్యాగును కనిపెట్టి బాధితులకు ఇవ్వడంతో వారు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డికి వారి సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.



# ప్రజావాణి దరఖాస్తులు, పెండింగ్ ఫైళ్లను తక్షణమే పరిష్కరించాలి

### అన్ని వసతి గృహాలలో పక్కాగా కామన్ డైట్ మెనూ పాటించే విధంగా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలి.

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్.



**మహబూబాబాద్, మార్చి 23(నంది పత్రిక):**ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ స్వయంగా గూగుల్ మీట్ ద్వారా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తు దారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్, భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దారులు, కచ్చితంగా వసతి గృహాలను తనిఖీ చేసి, కామన్ డైట్ మెనూ, త్రాగునీరు, దుస్తులు, తదితర సౌకర్యాలను కచ్చితంగా తనిఖీ చేయాలని, వసతి గృహాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన "కీ "సంబంధిత అధికారి వద్ద ఉంచుకోవాలని సూచించారు. ప్రతి మెనూ గూగుల్ ఫోటో, జియో ట్యాగింగ్, తెప్పించుకోవాలని, షెడ్యూల్ ప్రకారం ఆర్బిఎస్కే వైద్య క్యాంపుల ద్వారా పిల్లలకు భోజనం సిద్ధం చేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఫుడ్ పాయిజన్ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన 146 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుల పట్ల కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి

### కనపడని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

### అమలు జరిగిని మద్దతు ధరలు

### రైతులను దోచుకుంటున్న మధ్య దళారులు

### సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 23 నంది పత్రిక** మొక్కజొన్న రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ విమర్శించారు. ఆళ్లగడ్డ పట్టణంలో జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి .రమేష్ కుమార్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని, ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అమలు జరగక, తక్కువ ధరకు అమ్ముకొని మధ్య దళారుల చేతుల్లో రైతులు మోసపోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రుద్రవరం, ఆళ్లగడ్డ మండలంలోని కొన్ని గ్రామాల్లో రైతులతో కలిసి మాట్లాడినామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్వింటాలకు 2400 రూపాయలు మద్దతు ధర ప్రకటించడం తప్ప, ఆచరణలో మన రాష్ట్రంలో మద్దతు ధర చట్టాన్ని అమలు చేయడంలో రెండు ప్రభుత్వాలు కూడా విఫలం అయ్యాయన్నారు. . పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వమే జోక్యం చేసుకొని రైతుల వద్ద మొత్తం మొక్కజొన్నలను కొనుగోలు చేసిందన్నారు. మన రాష్ట్రంలో కేవలం 1600 రూపాయలకు మాత్రమే మధ్య దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. గడిచిన ఖరీఫ్ సీజన్ నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రచార ఆర్భాటాలు చేయడం తప్ప రాష్ట్రంలో ఏ ఒక్క చోట కొనుగోలు కేంద్రం పెట్టలేదన్నారు. ఓట్ల అవసరాల కోసం రైతుల గురించి గొప్పగా చెప్పుకోవడం తప్ప ఆచరణలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా, మధ్య దళారులు ఇష్టం వచ్చినట్టు రైతులను దోచుకోవడానికి ప్రభుత్వాలు అవకాశం కలిపిస్తున్నాయన్నారు. ఒక ఎకరాకు 40వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి ఖరీఫ్ సీజన్లో ఎకరాకు 15 నుండి 20 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతే, ప్రస్తుతం రబీలో దిగుబడిలో ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు పెరిగిన కూడా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం మూలంగా కేవలం 1600 కు మాత్రమే అమ్ముకొని నష్టపోతున్నారు. ఇష్టానుసారం విత్తనాలు, ఎరువులు పురుగు మందుల ధరలు పెంచే ప్రభుత్వాలు, సకాలంలో కొనుగోలు ఎందుకు పెట్టడం లేదో ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రభుత్వాలే మధ్య దళారులతో కుమ్మక్కయి రైతుని దోచుకునుటకు అవకాశం కల్పిస్తుందని అనుమానాలు కలుగుచున్నాయి అని అన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధు లు ముఖ్య మంత్రి తో మాట్లాడి ఎందుకు కొనుగోలు కేంద్రాలు పెట్టించడం లేదో రైతులకు సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి వెంటనే జిల్లాలో అన్ని మండలాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరలు అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. మన దేశంలోనే మద్దతు ధరలు లేక నష్టపోతుంటే గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా మోడీ అమెరికాతో ఒప్పందాలు చేసుకుని మొక్కజొన్నలు, పత్తి, సోయాబీన్, పండ్లు, పాలు మొదలగు ఉత్పత్తులు దిగుమతి చేసుకొని దేశ రైతులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారన్నారు. కావున రైతులందరూ మన దేశానికి నష్టం కలిగించే ఒప్పందాలను రద్దు చేయాలని ,అందుకు రైతులందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామచంద్రుడు, రైతు సంఘం నాయకులు జి. శంకర్ పాల్గొన్నారు.



# నాగర్ కర్నూల్ జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరిక



ఎక్కడైనా అనధికార తవ్వకాలు జరిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టంనిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలుజిల్లా ఐడిఓసీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహణసమావేశంలో జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్లు పాల్గొన్నారుఇసుక బుకింగ్ పూర్తిగా "మన ఇసుక వాహనం" యాప్ ద్వారానే జరగాలని ఆదేశంఆఫ్‌లైన్ బుకింగ్ పూర్తిగా నిషేధంజిల్లాలోని 15 ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలింపు పూర్తిగా ఆన్లైన్ విధానంలోనేనెంబర్ ప్లేట్ లేకుండా ఇసుక తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘానెంబర్ ప్లేట్ లేని వాహనాలను తక్షణమే సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కఠినతరం చేయాలని ఆదేశం రాత్రివేళల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అక్రమ రవాణాపై అడ్డుకట్ట

**పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచనలు**అన్ని ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

అవసరమైతే డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడిఅక్రమ ఇసుక డంపులను గుర్తించి చట్టబద్ధంగా తరలించాలని ఆదేశాలుఅక్రమ రవాణా, డంపులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరా నిరంతరంగా కొనసాగించాలని ఆదేశం ప్రజలకు పారదర్శకంగా, సులభంగా ఇసుక అందుబాటులో ఉంచే చర్యలు

అభివృద్ధి పనులు, సాగునీటి ప్రాజెక్టులకు ఇసుక సరఫరాలో అంతరాయం లేకుండా ప్రణాళికలుప్రభుత్వ అవసరాలకు ప్రత్యేక ఇసుక రీచ్ గుర్తించాలని మైనింగ్ అధికారులకు ఆదేశంజిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్: అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తప్పవురాత్రిపూట ఇసుక తరలింపును పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక



చర్యలుఆన్లైన్ రిజిస్ట్రేషన్ లేకుండా ఇసుక తరలించే వాహనాలపై కఠిన నిఘా తహసీల్దార్లు, పోలీసులు కలిసి అక్రమ తవ్వకాలపై గట్టి చర్యలు తీసుకోవాలని సూచన....

# గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే లక్ష్యం సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్

గ్రామాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి పరచడమే తమ లక్ష్యమని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో రెండో వార్డులో సోమవారం అంతర్గత సిమెంటు రహదారుల నిర్మాణానికి సర్పంచ్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్, పాలాది మల్లీశ్వరి రంగనాథం, మారేపల్లి శ్రీను, ముదిగొండ రమేష్, పురుషోత్తం చారి, గుద్దేటి కిష్టాల్, సిర్సనగండ్ల శేఖర్, రవీందర్ రెడ్డి, భయ్య మల్లయ్య, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీ సభ్యులకు గణ సన్మానం



నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రంలో మాలల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీ సభ్యులకు సోమవారం గణంగా సన్మానం నిర్వహించారు. వెల్దండ మాలల కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీ నాగర్ కర్నూల్ జిల్లా చైర్మన్ గా జంగిలి నిరంజన్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే వెల్దండ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీ ఏర్పాటు చేసి మండల కమిటీ, గ్రామ కమిటీ లను ఎన్నుకోబడింది. నూతన మండల కమిటీ అధ్యక్షులు సిరిసనగండ్ల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జంగిలి ప్రసాద్, మరియు గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు జంగిలి రవికుమార్, జంగిలి ప్రవీణ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నుకోబడిన సభ్యులకు ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ సందర్భంగా మాలల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల మాల కమిటీ సభ్యులు కేసమల్ల కృష్ణ, కొట్ర గ్రామ సర్పంచ్ శారదచెన్నయ్య, నిరంజన్, ఆనంద్ రాజ్, యాదగిరి, అశోక్ కుమార్, వెంకటయ్య, ప్రశాంత్, శ్రీను, సైదులు, సుధాకర్, రాజన్న, రాజు, కృష్ణయ్య, చెన్నకేశవులు, విద్యాసాగర్, కృష్ణయ్య, విష్ణు, నిఖిల్, భాను, పాల్గొన్నారు.

# ‘రూపం’ మోసకారి!

నిజానికి రూపవాదుల్లో పాఠకులను రంజింప చేసే రచయితల నుండి విసుగు పుట్టించే వారి దాకా అన్ని రకాల వారూ ఉంటారు. అందుకు ఆత్మాశ్రయవాదుల నుండి మరి ఏ ఇతర తరహాల వాదులూ అతీతం కారు. అయితే సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలన్న ఆదర్శంతో మాట్లాడేవారు ఈ విషయంలో ఎక్కువ విమర్శకు గురవటం పరిపాటి. తాము ప్రకటించుకున్న ప్రగతిశీల ఆశయానికి అనుగుణంగా ఉత్తమ సాహితీ సృజన చేయలేకపోయినపుడు, అలాంటి వారిని విమర్శిస్తే మంచిదే. అలాకాక సాహిత్యకారులకు సామాజిక నిబద్ధత ఉండాలి అనే భావాన్ని పల్చన చేయడం కోసం ఉద్దేశించితే అది క్రమంగా రూపవాద సమర్ధనకు దారితీస్తుంది. మార్క్సిస్టులు రూపాన్ని పట్టించుకోరన్న విమర్శ సరి కాదు. ఎందుకంటే రూపం లేని వస్తువే లేదు. వస్తు సారానికి, దాని రూపానికి విడదీయలేని గతితార్కిక సంబంధం ఉంది. మార్క్సిజం పుట్టుక కంటే ముందే దీన్ని ఒక సామాజిక వాస్తవంగా గుర్తించి తమ పద్ధతులలో చెప్పినవారున్నారు. 2000 సంవత్సరాల క్రితందిగా భావించే ‘భరతుని నాట్య శాస్త్రం’లో వస్తురూప సంబంధం గురించి చాలా స్పష్టంగా ప్రశ్నలుజవాబుల రూపంలో ఉంది. రూపం కోసం వస్తువు లేదనీ, వస్తువుని స్వీకరణ యోగ్యంగా మార్చడానికే రూపం ఉన్నదనీ నాట్యశాస్త్రంలో చెప్పి ఉన్నారు. కల్తీ బంగారానికీ మేలిమి బంగారానికీ, నకిలీ విత్తనాలకు అసలు విత్తనాలకూ రూపం ఒకటిగానే వుంటుంది. కానీ సారంలోనే తేడా అంతా. ఈ సారమే ప్రాథమికమైనది. ప్రజలకు కావలసినదీ! నకిలీ విత్తనాలకు, నకిలీ బంగారానికీ తేడా తెలుసుకోలేక మోసిపోయినట్లే సాహిత్య కళా రంగాలలో జిలుగులు, మెరుపులు, చిత్ర విచిత్ర విన్యాసాలకు పాఠకులు/ ప్రేక్షకులు అసలు విషయాన్ని పట్టించుకోలేకపోయే పరిస్థితులు సందర్భాలు ఉంటాయి. ఈ రూప విన్యాసాలతో తమ అవగాహన పరిమితులను, పరిజ్ఞానలేమిని దాచుకునే సాహిత్యకారులు కూడా ఉంటారు. వీరిని కనిపెట్టి బయటపెట్టవలసిన పూచీ సాహిత్య విమర్శకులది. విమర్శ అనేది ఎంత్ ఖ్షుఅఎశ్రీవంం యశీఎ ఐనా, అంతకుమించిన బాధ్యత కూడా! అసలునూ నకిలీని వివరించి నాణ్యతను నిర్ధారించగలిగిన గీటురాళ్లు కలిగిన వారే సాహిత్య విమర్శకులుగా స్థిరపడతారు, గుర్తింపబడతారు. పాఠకుడిని వస్తువు చేసే మోసాన్ని గ్రహించనివ్వకుండా రూపవాదం దోహదపడుతుంది. రూప విన్యాసాలకు మురిసిపోయే పాఠకులు సారంలోని లోపాన్ని లేక మోసాన్ని గ్రహించలేరు. విమర్శకులు కూడా అదే స్థాయిలో ఉన్నట్లయితే సాహిత్య విమర్శ తన స్థాయిని కోల్పోయినట్టు. రూప వైవిధ్యం, సరికొత్త ప్రయోగం, సృజనాత్మక అభివ్యక్తి అనేవి వస్తు విశేషానికి వన్నెతెచ్చేదిగా ఉండాలి కానీ ‘రూపం కోసమే రూపం’ లాంటి రూపవాద విమర్శ ఉండకూడదనే ప్రగతిశీల వాదులు కోరుకుంటారు. ఈనాటి సంక్షుభిత, అత్యంత సంక్లిష్ట సామాజిక పరిస్థితులను తెలుసుకోవటానికి, మార్క్సిజం లాంటి తాత్విక దార్శనికత రచయితలకు బాగా సహాయకం కాగలుగుతుంది. ఎందుకంటే దేశాన్ని/ సమాజాన్ని చుట్టిముట్టిన భయంకర సాంస్కృతిక సంక్షోభపు సంక్లిష్ట స్వరూప స్వభావాలను రచయితలు బాగా అర్థం చేసుకుని తమ సాహితీ సృజన కావించాలంటే ఆ సంస్కృతికి మూలమైన ఆర్థిక రాజకీయ లోతుపాతులు, సామాజిక పరిణామాలు అర్థం చేసుకోవడం అవసరం. స్థూలంగా ఈ తరహా దృష్టి కోణాన్ని మార్క్సిస్టు సామాజిక చింతన అని అంటూ ఉంటారు. అయితే కేవలం మార్క్సిస్టు పరిజ్ఞానమే ఉత్తమ సాహిత్య సృజన చేయలేదు. అందుకు జీవితాన్ని దాని వ్యక్తీకరణ రూపమైన మానవ సంబంధాల వెనుక గల సామాజిక కారణాలను అన్వయించుకోవటానికి జీవిత పరిశీలన, సాహిత్య అధ్యయనము, స్వీయ అనుభవమనే ఆచరణ చాలా ముఖ్యం. వైయక్తిక అనుభూతులు, అనుభవవాదం దానికి సరిపోవు. సాహిత్య కళారంగాలలో జీవిత సారానికి తగిన రూపాన్ని ఎంచుకోవటం, రూప వైవిధ్యాల బహుముఖ ప్రక్రియలలో నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవటం రచయితల, కళాకారుల ముఖ్య విధి. ఒక శిల్పాన్ని చెక్కటానికి ఎంత శిక్షణ, ఏకాగ్రత, నైపుణ్యం, అంకితభావం కావాలో అవన్నీ ప్రజాకళాకారులకు మార్క్సిస్టు రచయితలకూ అవసరమే. రూపకళలో నైపుణ్యాల సాధన కూడా ఆచరణలో భాగమే. అది కేవలం సిద్ధాంత పరిజ్ఞానంతో లభించేది కాదు. “సాధనమున పనులు సమకూరు ధరలోన”! అయితే “కన్ను పోయేంత కాటుక పెట్టుకోకూడదన్నదే” జీవితానుభవం నేర్పేది. అంటే సారాన్ని రూపం మింగెయ్యటమో, బలహీనపరచటమో, నిర్లక్ష్యపరచటమో చేయకూడదన్నమాట. సాహిత్యంలో వస్తువునురూపాన్ని రెండు కళ్ళతో పోల్చేవారు ఉన్నారు. వినటానికి ఆ పోలిక బాగానే ఉన్నట్లున్నా అది సరైన పోలిక కాదు. ఒక కన్ను లేకపోయినా రెండవ కన్ను ఒక్క దానితో కూడా చూడగలం. అది అలా ఉంచి ఏ ఒక కంటి కోసంగానీ దాని మీద ఆధారపడిగానీ రెండవ కన్ను లేదు. సాహిత్యంలో వస్తు రూపాలకు విడివిడి అస్తిత్వం లేదు. సంఘజీవిగా సామాజిక బాధ్యతతో కూడిన సద్వర్తన కలిగి ఉండమనే వక్కాణింపు లేకుండా, మంచి అలంకరణ చేసుకోమని కొత్త తరాలకు అదే పనిగా చెప్పటం ఎలాంటిదో సాహిత్యంలో రూపవాదం గురించి ఎక్కువ మాట్లాడటం అలాంటిదే! గిరీశం ఇంగ్లీషు మాటలను అడ్డం పెట్టుకున్నట్లు, వ్యక్తిత్వాన్ని కప్పిపుచ్చే అలంకరణ సామాగ్రి కొందరికి బాగా ఉపయోగపడుతుంది.

రూపం ఆకర్షణలో పడిన వారిని అది మోసం చేయగలగటం అత్యంత సహజం! కన్యాశుల్కపు గిరీశాన్ని తలదన్నే రాజకీయ గిరీశాల ఏలుబడిలో ప్రజలనే నేటి బుచ్చమ్మలు మోసపోతుంటే దాన్ని బట్ట బయలు చేయవలసిన బాధ్యత సాహితీకారులదే కదా! నేను అర్థం చేసుకున్న మేరకు రాజకీయాలకు మించిన గొప్ప కళ లేదు. “రాజకీయాలను మినహాయించిన సాహిత్యం గురించి మాత్రమే మాట్లాడే వారు, అయితే మోసపోయిన వారో లేకుంటే మోసపుచ్చేవారో అయి ఉంటారు,” అన్నారు కొడవటి గంటి. జీవితమంటే రాజకీయం కాదు కానీ రాజకీయం స్పృశించని జీవితం లేదు. జీవితాన్ని రాజకీయం ఏ మేరకు ప్రభావితం చేస్తే, శాసిస్తే, అదుపు చేస్తే, అడ్డుకుంటే, ముందుకు నడిపిస్తే ఆమేరకు సాహిత్యం, కళలు రాజకీ యాల్ని తప్పనిసరిగా పట్టించుకోవాలి, నిరసించాలి, ధిక్కరించాలి, ఎదురించాలి, మనస్ఫూర్తిగా బలపరచాలి. అప్పుడు మాత్రమే రచన జీవన వాస్తవికతకు దగ్గర కాగలు గుతుంది. ప్రజల పక్షాన నిలుస్తుంది.

తమకంటే ఎంతో బరు వైన శక్తివంతమైన ఏనుగును, మానవులు గోతిలోకి పడ గొట్టేది ఆ గోతి పైన చేసిన మోసకారి అలంకరణలతోనే కదా! రూపానికి మోసం చేసే గుణం ఉంది అనడానికి ఇంత కంటే పెద్ద ఉదాహరణ ఏమివ్వగలం? విమర్శకులు తమ విశ్లేషణల ద్వారా, రూపానికున్న మోసపుచ్చే కళను గురించి కూడా పాఠకుల, సాహిత్యకారుల దృష్టికి తేవాలి.

## వట్టివాగులో చేపలు పట్టే వ్యక్తి మృతి.





**కేసముద్రం, మార్చి 23(నంది పత్రిక):** కేసముద్రం మండలం అర్పణపల్లి సమీపంలోని వట్టివాగు ఏరులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కేసముద్రం ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హనుమంతుని గడ్డకు చెందిన అలువాల సాయిబాబా(29) ప్రతిరోజు చేపలు పట్టి అమ్మి కుటుంబాన్ని పోషించుకునేవాడు. రోజు మాదిరిగానే ఆదివారం మధ్యాహ్నం అర్పణపల్లి శివారులోని వట్టివాగు ఏరులో చేపలు పట్టడానికి వెళ్తున్నానని తన భార్య ఉమకు చెప్పి మహబూబాబాద్ నుండి బయలుదేరి అర్పణపల్లి శివారులోని వట్టివాగు ఏరులో చేపలు పట్టడానికి వలను వేయగా, ప్రమాదవశాత్తు వల అతని కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి చనిపోయాడు. మృతునికి భార్య ఉమ, కూతురు కారుణ్య, కుమారుడు కౌశిక్ ఉన్నారు. మృతుని భార్య ఉమ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఇంటికన్నెలో భారీ ర్యాలీ.




**కేసముద్రం, మార్చి 23(నంది పత్రిక):** ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఇంటికన్నె గ్రామస్తులకు నీటిని వృధా చేయకుండా అన్ని విధాల ఉపయోగించుకునేలా అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య మంగ్యా, జెడ్పిహెచ్ఎస్ పాఠశాల హెడ్మాస్టర్ శారదాబాయి, పాఠశాల చైర్మన్ కదిర ఉమ, ఎంపీపీఎస్ హెడ్మాస్టర్ ఓంజి, ఉపాధ్యాయ బృందం, యూత్ అధ్యక్షుడు నలమాస సందీప్ గౌడ్, బాలవికాస సంస్థ ప్రతినిధి ప్రశాంత్, కోతి బాల, జగన్ గౌడ్, గంధసిరి మల్లేష్ పాల్గొన్నారు.

# మహామానవవిషాదానికి కవిత్వసాక్ష్యం

కవి అయినా, రచయిత అయినా, ఉద్యమకారుడైనా, బుద్ధిజీవులైనా ఎప్పటికప్పుడు అసత్య ప్రపంచాల పెచ్చులను పెకిలించందే వాస్తవ ప్రపంచం ఆవిష్కరణ కాదు. ఉద్యమకారుడు కవి అయితే, కవి ఉద్యమకారుడు అయితే ఈ ప్రక్రియ మరింత మెరుగ్గా సమాజం ముందు స్పష్టం అవుతుంది. ఉద్యమ కార్యకర్త అయిన కవి మానవ భావోద్వేగాల్లోకి, సమాజ మూలాల్లోకి మరింత లోతుగా వెళ్ళగలరు. ఎందుకంటే సమాజ పరిశీలన కోసం కవి, కార్యకర్త కలిసి చేసే అన్వేషణ సంపూర్ణ సత్యాన్వేషణగా ఉంటుంది. కవిత్వం ప్రపంచంలో మరింత లోతుగా వెళ్లడానికి, మానవ భావోద్వేగాలను అర్థం చేసుకోవడానికి క్షేత్రస్థాయి కార్యకర్త పాత్ర దోహదపడుతుంది. నందిని సిధారెడ్డి లోని కవి, కార్యకర్త కలగలిసి ఆయన కవిత్వాన్ని మానవ వికాస సాధనంగా బహిర్గతం చేశాయి. ‘భూమి స్వప్నం’తో సిధారెడ్డి మొదలుపెట్టిన ఈ మానవ సమాజ సంస్కరణ పని ‘అనిమేష’ వరకు కొనసాగుతూనే ఉన్నది. ‘సంభాషణ’ (1991)లో చౌరస్తాలో సిగ్నల్ పడ్డప్పుడు కార్ల అద్దాలు తుడిచే పిల్లలను, కార్ఖానాల్లో మగ్గిపోతున్న బాల కార్మికుల జీవితాలను ఎంత లోతుగా చూడగలిగాడో, ‘అనిమేష’ (2020)లో కరోనా వైరస్ దాడికి చెల్లాచెదురైన మనుషుల జీవితాలను అంతే లోతుగా ప్రేమగా చూడగలిగాడు. సిధారెడ్డి ఉద్యమకారుడిగా ఎంత ముక్కుసూటిగా శాస్త్రీయంగా ఉంటారో కవిగా అంత నిశ్చితాభిప్రాయాలతో ఉంటారు. పదాలను కొద్దిగా కాల్పనికతలోకి ముంచి తీస్తారు. సామాజిక జీవిత సత్యాలను వెల్లడించడానికి సిద్ధపడ్డ కవుల కవిత్వం ఎప్పుడు వాస్తవిక, కాల్పనికతల మేళవింపు తోనే ఉంటుంది. అతిమార్మికతలకు సిధారెడ్డి అత్యంత దూరం. చెప్పేది ఏదైనా సూటిగా గుండెకు తాకుతున్నట్టు చెప్పాలనేది ఆయన సిద్ధాంతం. కవిత్వాన్ని లోతైన మార్మికతల నుండి వాస్తవిక, సంపూర్ణ, ఖచ్చిత, ప్రతిఫల సాధనంగా మలచి, సరళం, స్పష్టం, సామాన్యం చేసేందుకు గొప్ప గొప్పవారు చాలా కృషి చేశారు. చెహోవ్ మాక్సిం గోర్కీకి అస్పష్టతల నుండి దూరం కమ్మని పదేపదే చెబుతుండేవాడు. సిధారెడ్డి కూడా తన దగ్గరివారికి ఇలాంటి సలహాలే ఇస్తూ ఉంటారు. సిధారెడ్డి లాగా చెప్పడం ఒక కళ, వారికే సాధ్యమైన కళ: “పిట్ట ముట్టలేదు/ రావడానికైనా/ ముట్టడానికైనా/ పిట్టలుంటే కదా”. ప్రకృతిని పక్షులను కోల్పోయి ఒంటరిగా మిగులుతున్న మనిషి దీనస్థితిని ఇంతకంటే బాగా చెప్పగల కవిత్వ సాధనం ఇంకేమైనా ఉన్నదా?

ఒక కళాత్మకత నిర్ధారణను సందేశంగాను, ఉపదేశంగానూ చెప్పడం, సందేశాన్ని కళానిర్మాణంతో కూర్చి, సహజ విషయంగా వెల్లడించడం ఆయనకు మాత్రమే తెలిసిన విద్య. మనిషి, సమాజమే ఆయన కవిత్వం ముడి సరుకులు. మనిషి లేని, సమాజం లేని, మానవత్వం లేని ఊహాతీత పదాల జోలికి ఆయన వెళ్ళలేదు. పెన్నా శివరామకృష్ణ గారు చెప్పినట్టు నాడైనా నేడైనా సామాజిక, రాజకీయ అంశాలకు దూరమైన కవితలను ఆయన రాయలేదు.

కరోనా వైరస్ ఒక ప్రపంచ కుదుపు. ఆ కుదుపులో సోలిపోయిన జీవితాలను సిధారెడ్డి లోపలి కవి పట్టుకున్నాడు. “కాళ్ళ కింద నదులే/ కళ్ళ కింద నదులే/ మనిషిని చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేసే” నదులను కవి చూడగలిగాడు. ఆ ఉపద్రవపు తీరొక్క మానవ అంతర్ మదనాలను ఆయన కవిత్వం చేశారు. నూటా పన్నెండు పేజీల ‘అనిమేష’ నిండా ఉన్నది మనిషి వేదనే. ముంగిలికొచ్చిన వింత విపత్తు ఎంతటి ప్రమాదమో తెలియని గడ్డుస్థితిని ఆయన కవిత్వం చేశారు. కాలం క్యాలెండర్‌కు అడ్డం తిరిగి, విషకోర కాటుకు మానవత్వం కాలిన వాసనను కవిత్వంతో చిత్రీకరించారు. మనిషి చావు బతుకుల అలాంటి దైన్యస్థితిలోనూ పెట్టుబడిదారీ విధానం నిసిగ్గుగా తన వికృత రూపాన్ని ప్రదర్శించింది. శవాల మీద లాభాలను కొల్లగొట్టుకునేందుకు పెట్టుబడి రాబందులు అన్ని రకాలుగా అస్త్రశస్త్రాలను సంధించాయి. ఈ నాటకీయ పరిణామాలు సిధారెడ్డి దృష్టిని దాటిపోలేదు. విజ్ఞుడైన, ప్రజాపక్షపాతి అయిన ఏ కవి దృష్టినీ అవి దాటిపోలేవు. కరోనా శరీరంలో బతుకుతుంది.. సార్వభౌమత్వం పెట్టుబడిలో బతుకుతుంది అనే నిజాన్ని గ్రహించినవాడు కాబట్టి ముల్లుని ఆర్థికముల్లే అని తేల్చేశాడు. వ్యాపారం భుజం మీద చేయి వేసి కొత్త రూపం ఎత్తనున్న రాజకీయ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాడు. ఎవరికి అర్థం కాని ఈ ఆటలో “ప్రపంచం ప్రయోగశాల/ జీవితం చిక్కులవల” అనే విషయాన్ని విశదీకరించాడు. ‘అనిమేష’ సంపుటి మొత్తం కేవలం కరోనా కవితలే అనుకుంటే పొరపాటే. వ్యాధిగ్రస్త సంక్షోభ సమయంలో మనుషుల మానసిక సంఘర్షణ, వైరస్ పేరుతో దోపిడికి తెగబడ్డ మార్కెట్ పెట్టుబడి శక్తుల యుక్తులు, ఈ విపత్తు ధాటికి చిగురుటాకుల వణికిన సమాజంలోని అట్టడుగు వర్గాలు... ఒకటేమిటి సమస్త మానవాళి భావోద్వేగాలకు, కాదు సమస్త విషయాల సమగ్ర చర్చకు ఇందులో అక్షర రూపం ఇచ్చారు. “స్నేహం చూపడానికి లేదు/ ప్రేమ ప్రకటించడానికి లేదు/ మంటల్లోంచి లేచే మూకుమ్మడి కమురువాసన/ జాలి జాలిగా గాలిలో కలిసిపోతుంది/ గాలికి మొక్కాలె.. గాలి వైరస్‌ను త్యజించింది”. పొగిలి వచ్చే దుఃఖాలను నాలుగు గోడల మధ్య అణచివేసుకున్న పరిస్థితులను ‘అనిమేష’ ద్వారా మనకు గుర్తు చేస్తున్నారు సిధారెడ్డి. భయం, ఒంటరితనం, భవిష్యత్తు పట్ల అనిశ్చితి ఆ కాలంలో మానవ జీవితాలను కుదిపేసింది. సిధారెడ్డి కవిగా ఆ కాలాన్ని రికార్డు చేశారు. కోవిడ్ కాలంలో ప్రపంచవ్యాప్తంగా చాలా సంకలనాలు వచ్చాయి. ౯ాశీవ్‌తీఖఱఅఎశీజఱఅ.ఎశీఎ లాంటి వెబ్‌సైట్లు ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ కవిత్వానికి వేదికగా నిలిచాయి. ‘ది వాల్ స్ట్రీట్ జర్నల్’ లాంటివి కోవిడ్‌పై వచ్చిన విషాద భరిత కవితలను రివ్యూ చేశాయి. జెస్సికా సల్ఫియా లాంటి వారు రాసిన హాస్య భరిత కవిత్వం పెద్ద ఎత్తున వైరల్ అయింది. లాక్‌డౌన్‌లో కష్టాలను, బాధలను పెట్టుబడిదారీ వర్గాలు ఎలా అవకాశంగా తీసుకుంటాయో చెప్పే ఆ కవిత ఆ తర్వాత ‘ది వాషింగ్టన్ పోస్ట్’లో పబ్లిష్ అయ్యింది. కరోనా గడ్డు పరిస్థితిల మీద ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల నుండి కవిత్వం వచ్చింది, అనేకమంది కవుల కవిత్వాన్ని కూర్చిన అనేక సంకలనాలు వచ్చాయి. కానీ వ్యక్తిగత కవితా సంపుటాలు తక్కువగానే వచ్చాయి. తెలుగులో మరీ తక్కువ. కోవిడ్ కాలాన్ని, బాధని, దుఃఖాన్ని కవిత్వం చేసిన నందిని సిధారెడ్డి గారి ‘అనిమేష’ కవిత్వ సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ రావడం తెలంగాణ కవిత్వానికి, తెలుగు కవిత్వానికి దక్కిన గొప్ప గౌరవం.

## మా వార్డు మా బాధ్యత అంటూ ముందుకొచ్చిన ప్రజలు.

### 8, 9వ వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: కౌన్సిలర్లు

### ప్రత్యేకంగా అభినందించిన సిఐ, ఎస్ఐ లు



**కేసముద్రం, మార్చి 23(నంది పత్రిక):** కేసముద్రం మున్సిపల్ పరిధిలోని ఎనిమిది, తొమ్మిదవ వార్డ్ కౌన్సిలర్ల అధ్యక్షతన సమావేశం నిర్వహించి రోడ్డు భద్రత, యువత భవిష్యత్తు, సమాజ శ్రేయస్సు దృష్ట్యా పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. రెండు వార్డులకు చెందిన ప్రజలందరూ కలిసి వార్డు పరిధిలోని ద్విచక్ర వాహన దారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరిస్తామని, వార్డుల్లో గంజాయి లాంటి మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ఇప్పటికే అలాంటి అలవాట్లు ఉన్న వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ద్వారా చర్యలు చేపట్టి మంచి మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వార్డు పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకొని తమ వార్డులు, తమ బాధ్యతగా భావించి ఆదర్శమైన వార్డులుగా తీర్చిదిద్దేందుకు ఒకరికొకరుగా సహకరించుకోవాలని తీర్మానించుకున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాన్ని స్ఫూర్తిగా తీసుకొని వార్డు ప్రజలు ముందుకు వచ్చి ఏకగ్రీవ తీర్మానాలు చేసుకోవడం అభినందనీయమని సీఐ సత్యనారాయణ, క్రాంతి కిరణ్ తెలిపారు. ఏప్రిల్ 2 నుండి 15 రోజులపాటు అందరికీ హెల్మెట్ వాడకం ఒక అలవాటుగా మారేలా కృషి చేస్తామని వార్డు ప్రజలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వేముల భారతి శ్రీనివాస్ రెడ్డి, కనుకుల సుభద్ర రాంబాబు, మార్కెట్ డైరెక్టర్ సంకేపల్లి నారాయణరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# రాజమండ్రి బీసీ గర్ల్స్ హాస్టల్‌లో మంత్రి సవిత ఆకస్మిక తనిఖీలు

ఈ సందర్భంగా మంత్రి సవిత హాస్టల్‌లోని ప్రతి గదిని పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. అక్కడ అందుతున్న వసతులు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఫార్మసీ, పారామెడికల్ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థినులు, తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో జాప్యం జరుగుతోందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్ మెస్‌ను తనిఖీ చేసిన మంత్రి, విద్యార్థునుల కోసం వండిన ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. అనంతరం విద్యార్థినులలో కలిసి కూర్చుని కాసేపు ముచ్చటించారు.



భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ..‘బీసీ హాస్టళ్లలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాం. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీ హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం. విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకోంటోంది’ అని అన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com